mohan PUBLICATIONS
Granthanidhi.blogspot.in
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రవరం - 533 101.
Mohanpublications.com
SUNDAY SPECIAL MAGAZINES
గ్రంథనిధి

తారాతీరం

దేవుడు ఆదేశిస్తే

రాజకీయాల్లోకి రమ్మని అభిమానులు కోరుకోవటం తప్పు కాదు.. కానీ నేను రాజకీయాల గురించి 20 ఏళ్ల క్రితమే స్పష్టం చేశాను.. నా పేరును కొన్ని రాజకీయ పార్టీలు వాడుకుంటున్నా పట్టించుకోలేదు.. ఇక నేను ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వటం లేదు.. నిజంగా ఆ దేవుడు నన్ను రాజకీయాల్లోకి రావాలని నిర్దేశిస్తే తప్పకుండా అలాగే జరుగుతుంది.. డబ్బుతో ముడిపడిన రాజకీయాలు చేయటం నాకు చేత కాదు. నిజాయితీగానే ఉండాలని దృఢంగా భావిస్తాను.. గతంలో ఒక రాజకీయ పార్టీకి మద్దతిచ్చి తప్పుచేశాను.. అని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. తన అభిమానులతో ఇటీవల ఆయన భేటీ నిర్వహించారు..

గౌతమిపుత్ర శాతకర్ణి చిత్రంలో వశిష్టాదేవి పాత్రతో తన టాలెంట్ ఏ రేంజ్‌లో ఉంటుందో శ్రియ మరోసారి ప్రూవ్ చేసింది.. యాక్టింగ్, డ్యాన్సింగ్ స్కిల్స్‌లో తిరుగులేని ఆధిపత్యం చూపించే శ్రియ శరణ్.. ప్రస్తుతం హీరోయిన్‌గా కెరీర్ కంటిన్యూ చేస్తున్నవారిలో సీనియర్ మోస్ట్. కృష్ణవంశీ దర్శకత్వంలో రూపొందుతున్న 'నక్షత్రం' చిత్రంకోసం తాజాగా హైదరాబాద్ వచ్చిన శ్రియ ఓ ఐటెం సాంగ్‌కు చిందేసింది. పనిలో పనిగా హైదరాబాద్‌లో షాప్ ఓపెనింగ్స్ కూడ పూర్తిచేసింది ఇలాంటి ఓపెనింగ్స్‌కు లక్షల్లో హీరోయిన్లకు చదివించుకోవాలనే సంగతి తెలిసిందే. కొత్త తారలు ఎంత మంది ఉన్నా ఆఫర్లుంటాయి. ఇందుకు ఆమె బిజినెస్ మేనేజ్మెంటే కారణమంటున్నారు.

భిన్నపాత్రలు

స్వతహాగా యంగ్ టైగర్ ఎన్టీఆర్‌కు కూచిపూడి, భరతనాట్యం వంటి శాస్త్రీయ నాట్యాలపై మంచి పట్టు ఉంది.. చిన్నప్పుడు ఆయన దసరా పండుగ వేడుకల్లో నెల్లూరుతోపాటు పలు పట్టణాల్లో దేవాలయాల్లో నాట్యం చేసి అవార్డులు గెలుచుకున్నారట. ప్రస్తుతం ఆయన తన అన్నయ్య నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మాతగా బాబి దర్శకత్వంలో 'జై లవకుశ' చేస్తున్నారు.. జై అనే నెగటివ్ క్యారెక్టర్, లవకుమార్ అనే బ్యాంకు ఉద్యోగి పాత్ర, కుశ అనే క్లాసికల్ డ్యాన్సర్‌గా నటిస్తున్నారని తెలిసింది. ఇక ఈ చిత్రం సెప్టెంబర్ 1న జనతా గ్యారేజ్ విడుదల తేదీనే రిలీజ్ చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు.

నాజూకు లావణ్యం

యుపి నుంచి వచ్చి హైదరాబాద్‌లో సెటిలైపోయిన లావణ్యత్రిపాఠికి మొదటి నుంచి పక్కింటి అమ్మాయి పాత్రలే పలకరించాయి.. యాక్టింగ్‌లో సూపర్బ్ టాలెంట్ చూపించటం, మొదటి నుంచి అదే టైపు కేరెక్టర్లు రావటంతో తనలోని గ్లామర్ యాంగిల్‌ని బయట పెట్టాలని ఫిక్స్ అయిపోయిందని అంటున్నారు. ఈ విషయాన్ని తను చెప్పటమే కాదు.. రీసెంట్‌గా రిలీజ్ అయిన 'రాధ' మూవీలో లావణ్యత్రిపాఠి గ్లామర్‌షో కూడ చేసింది.. అయితే అమ్మడికి తన పర్సనాలిటీపై బాగా అవగాహన ఉండటంతో.. ముందుగా బాగా వర్కవుట్స్ చేసి.. స్లిమ్ అయి మరీ అందాల ప్రదర్శనకు ప్రయత్నించిందని అంటున్నారు.. పాటల్లో కాస్త శృతిమించింది కూడ.. అందుకే మరీ సన్నగా మారిపోయిందని అంటున్నారు.

కె.లీలా సువర్ణ

పాజిటివ్ లైఫ్

డా॥ A.M. రెడ్డి
సీనియర్ వైద్యులు,
పాజిటివ్ హోమియోపతి
హైదరాబాద్, నిజామాబాద్
హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
Ph: 767-200-2000
767-200-7000

అసిడిటి - హోమియో చికిత్స

అసిడిటి అంటే ఏదైనా ఆహారం తీసుకోగానే తేన్పులు, చిరాకు, గుండెలో మంట వంటివి వస్తే దానినే అసిడిటి అంటారు. ఇది జబ్బు కాదు. జీర్ణవ్యవస్థ సరిగా లేకపోతే కడుపులో మంట, పొట్టలో ఆమ్లాలు ఉత్పన్నమవుతాయి. రక్తంలో ఆమ్ల, క్షార సమతుల్యత సమపాలల్లో ఉంటే ఈ సమస్య రాదు. జీర్ణాశయంలో జఠర గ్రంధులు జఠర రసాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఈ జఠర రసంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉంటుంది. ఇది జీర్ణాశయంలో బ్యాక్టీరియాలను నాశనం చేస్తుంది. ఒక్కోసారి ఇది అధికం అయినపుడు అసిడిటి అనే సమస్య తలెత్తుతుంది.

అసిడిటి ఉన్న వారిలో ఛాతిలోను, గొంతులోను, గుండెల్లోనూ, జీర్ణాశయంలోను మంటగా ఉంటుంది. పుల్లటి తేన్పులతో ఆహారం నోటిలోకి వచ్చినట్లును, కడుపు ఉబ్బరంగాను, వాంతి వచ్చినట్లు ఉంటుంది. మరియు మలబద్ధకంగా, అజీర్ణం పెరిగి ఆకలి మందగిస్తుంది. ఆల్కహాల్, పొగత్రాగడం, గుట్కాలు లాంటి పదార్థాలు తీసుకోవడం, మానసిక ఆందోళన, ఫాస్ట్‌ఫుడ్స్, మసాలాలు ఎక్కువగా తీసుకునే వారిలో అసిడిటి ఎక్కువగా ఉంటుంది.

చికిత్సా విధానం : అసిడిటి మందులు దీర్ఘకాలం వాడకూడదు. అజీర్ణం, పుల్లటి తేన్పులు, ఛాతిలో మంట వంటివి తరుచుగా వస్తూ ఉంటాయి. ఈ సమస్యలు ఎక్కువగా వృద్ధుల్లో చూస్తూ ఉంటాము. ఈ సమస్యకు సంబంధించి పాజిటివ్ హోమియోపతిలో చాలా అద్భుతమైన వైద్యం అందుబాటులో ఉంది. కాన్‌స్టిట్యూషనల్ సిమిలిమం అనే వైద్య విధానం ద్వారా ఎంపిక చేయబడ్డ మందుల వల్ల ఎన్నో ఆశ్చర్యకర ఫలితాలను చూస్తున్నాము. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేనటువంటి సురక్షితమైన చికిత్స పాజిటివ్ హోమియోపతిలో అందుబాటులో ఉన్నది.

An ISO 9001 - 2000 Certified ®

The art of healing

పాజిటివ్ హోమియోపతి

www.drpositive.in

మధుమేహం - హోమియో చికిత్స

రక్తంలో షుగర్ స్థాయి అదుపు తప్పి అసాధారణ స్థితికి చేరినందువల్ల తలెత్తే పరిస్థితిని డయాబెటిస్ లేదా షుగర్ వ్యాధి అంటారు. ఇది బయటకు కన్పించని ప్రాణాంతక వ్యాధి. ఈ వ్యాధిని నియంత్రించకపోతే దీని ప్రభావం శరీరంలోని మిగిలిన ప్రధాన అంగాలన్నీ తమ సమతుల్యతను కోల్పోతాయి. గుండె, మెదడు, కళ్ళు, మూత్రపిండాలు, పాదాలు, నాడులు వగైరా అన్నీ షుగర్‌వ్యాధి బారిన పడే అవకాశం ఉంటుంది. ఒకసారి షుగర్ వ్యాధి వస్తే దానిని పూర్తిగా తగ్గించే మార్గం లేదు. అదుపులో ఉంచుకుని కాలం నెట్టుకు రావడం మాత్రమే చేయగలం. ఈ వ్యాధి టైప్ 1, టైప్ 2 రెండు రకాలుగా ఉంటుంది.

టైప్ 1 దీనినే ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్ అంటారు. ఇది ఏ వయస్సులోనైనా కలుగవచ్చు. కాని ఎక్కువ పిల్లల్లో వస్తుంది. వీరిలో క్లోమగ్రంథి పూర్తిగా దెబ్బతిని ఇన్సులిన్ ఉత్పత్తి పూర్తిగా ఆగిపోతుంది. కాబట్టి ఇన్సులిన్ ఇంజక్షన్స్ జీవితాంతం వాడాల్సి ఉంటుంది. టైప్ 2 అనేది మధ్య వయస్సు వాళ్లకు మరియు వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి. ఈ తరహా వ్యాధిలో ఇన్సులిన్ ఇంజక్షన్‌తో ఉత్పత్తి జరుగుతుంది. దాని ప్రభావం కణాల మీద ఉండదు. కణాలకు చేరాల్సిన షుగర్ రక్తంలో ఉండిపోతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు : కుటుంబంలో పెద్దలకు ఉంటే పిల్లలకు వచ్చే అవకాశం 30 శాతం ఉంటుంది. తల్లిదండ్రులు ఇద్దరికి ఉంటే 60 శాతం వరకు ఉంటుంది. క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయాలి. ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. ఆహారంపై నియంత్రణ ద్వారా కొంతవరకు దూరం చేయవచ్చును. మధ్య వయస్సు వారు ప్రతి మూడు నెలలకు పరీక్షలు చేయించాలి. పాదాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఏ విధమైన దెబ్బలు తగలకుండా చూసుకోవాలి.

హోమియో చికిత్స: పాజిటివ్ హోమియోపతిలో డయాబెటిస్ కు చాలా అద్భుతమైన వైద్యం అందుబాటులో ఉంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్‌తో వచ్చే కాంప్లికేషన్స్ అతి సులభంగా అధిగమించవచ్చు. కాన్‌స్టిట్యూషనల్ సిమిలిమం ద్వారా ఇచ్చే మందుల ద్వారా అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు.

బేగంపేట | అమీర్‌పేట | జూబ్లిహిల్స్ | కొండాపూర్ | కూకట్‌పల్లి | విక్రమ్‌పురి | A.S.రావు నగర్
కాచిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | మెహిదీపట్నం | నిజామాబాద్ | హన్మకొండ | కరీంనగర్ | ఖమ్మం | తమిళనాడు

ఆదివారం వార్త

21 మే 2017

మంచి ముత్యాలు

గులాబీ బోధ చేయదు. పరిమళాన్ని గుబాళిస్తుంది. అలాగే అధ్యాపకుడు తన జీవిత పరిమళంతో బోధించాలి.

-గాంధీజీ

విషయ విశేషం

'సంఘీ'భావం
మాతా, శిశు మరణాలు ఆపాలి!.. 5
మూడో కన్ను
కర్ణన్..ఓ క్వశ్చన్‌మార్క్! ...6
కవర్‌స్టోరీ
ఉగ్రం..మహోగ్రం!
ఆపేదెలా! ఆర్పేదెలా?..8
కవితా! ఓ కవితా!......12
ప్రేమ కథామాలిక
జ్ఞానదేవుడి విశ్వప్రేమ!...14
ఆహారం..ఆరోగ్యం.....18
కథ
జయం...!20
ఈవారం కవిత్వం
శిశువీధి....23



చిత్రభారతి
బాలల చిత్రాలకు
చేయూతనివ్వండి!....30
ఇంకా..కృతి, మొగ్గ, నవ్వుల్..రువ్వుల్,
వాస్తు వార్త, పదమథనం
..వారఫలం.. వగైరా... వగైరా.

లేఖలు

విజ్ఞానదాయకం..

మే 7 వార్త ఆదివారం అనుబంధం లో అందించిన కవర్ స్టోరీ 'మన బ్యాం'కింగ్' ..నాడు నేడు' లో అనుబంధ బ్యాంకుల విలీనం అంశంతో పాటు మన దేశంలో నాటి నుంచి..నేటి వరకు బ్యాం కింగ్ వ్యవస్థను ఆమూలాగ్రం వివ రించారు. విజ్ఞానదాయక కథనా న్ని అందించిన మీకు మా థ్యాంక్స్.

-సి.భాస్కర్, హైదరాబాద్; ఎన్.రాజశేఖర్, ఒంగోలు; ఆర్.పావని, కాకినాడ.

అలరించిన ఆర్టికల్స్

మే 7 వార్త ఆదివారం అనుబంధంలో 'చిత్ర భారతి'లో కె.విశ్వనాథ్..'ప్రతిభ చాటుతూ ఆయన దర్శకులలో మణిపూస వంటివారు అని, సినీరంగంలో ఆయన స్థానం మహనీ యమని వివరించినతీరు బాగుంది. సాహితీ వనంలో భల్లంగారి వ్యాసం 'కవిత్వానికి.. కొలమానమేమిటి?" ఉన్నది ఉన్నట్లుగా విశదీ కరించారు. -పక్కి రాధాగోపాల కృష్ణ, విశాఖ.

చక్కని సంచిక

మే 7 వార్త ఆదివారం అనుబంధంలో 'గాహే తవ జయ గాథా' అంటూ భావవీచికలో ఠాగూర్ అక్షరపథం గురించి ఎన్నెన్నో విశేషా లు తెలియజేశారు. వాయు కాలుష్యానికి విరు గుడు విద్యుత్ వాహనాలేనని 'సంఘీ' భావం' లో చక్కగా తెలియజేశారు. ట్రంప్ 100 రోజుల పాలనపై మూడోకన్నులో విశ్లేషించిన తీరు బాగుంది. మన బ్యాం'కింగ్'.. కవర్‌స్టోరీ ఎంతో అమూల్యమైందిగా ఉంది. 'పివరే హాస్యరసం' ఆర్టికల్ ఎంతగానో అలరించింది.

-అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, కూకట్‌పల్లి.

ఆర్టికల్ బాగుంది

మే 7 వార్త ఆదివారం మేగజైన్‌లో ప్రపంచ నవ్వులదినోత్సవం సందర్భంగా అందించిన 'పివరే హాస్యరసం' ఆర్టికల్ బాగుంది. క్లుప్తం గానే అయినా అన్ని విషయాలూ వివరించారు. నవ్వులపాలు కాకుండా నవ్వడం, నవ్వించడం ఒక గొప్పవరం. -కె.సుమిత్ర, సికింద్రాబాద్.

ముచ్చటైన మ్యాగజైన్

మే 7 వార్త ఆదివారం మేగజైన్‌లో భావ వీచిక ద్వారా రవీంద్రుడిని మా జ్ఞాపకాల్లో నిలిపారు. వాయుకాలుష్యానికి విద్యుత్ వాహ నాలే విరుగుడన్నది శతశాతం వాస్తవం. ఈ వారం కవిత్వం ఎంతగానో ఆకట్టుకుంది. సింగిల్‌పేజీ కథ మలుపు బాగుంది.

-నేమాని సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం.

వెరైటీ అంశాలు

మే 7 వార్త సన్‌డే మేగజైన్‌లో మంతెనగారి కథ 'పిల్లి పులిగా మారితే' చక్కని హాస్యాన్నం దించింది. నవ్వు అవసరం, ఆవశ్యకతను, 'పివరే రామరసం'లో తమాషాగా చెప్పారు. గీతా సుబ్బారావుగారి కార్టూన్లకు రాత కూడా ఆయనదే అయితే మరింత అందాన్నిచ్చేది.

-డా.శివభూషణం, కర్నూలు.

భావ వీచిక

చెట్టుతో చెలిమి..ఆరోగ్య కలిమి!

చెట్టు మన ఉనికికి ఆటపట్టు. ఈ విషయం పట్ల నూరుపాళ్లు చైతన్యంతో ఉన్నారు కాబట్టే కర్నాటకలోని సర్జాపూర్ పౌరులు 4 చెట్లను బతికించుకోగలిగారు. సర్జాపూర్‌లో రోడ్లను విశాలం చేయటానికి సంబంధిత శాఖవారు పూనుకొన్నారు. అందులో భాగం గానే అందుకు అడ్డంగా ఉన్న చెట్ల కూల్చివేతకు పూనుకొన్నారు. ఎన్నో చెట్లు నేలకూలాయి. అన్నీ పెద్దపెద్ద చెట్లే. చూస్తున్న ప్రజల హృదయాలు బరువెక్కాయి. తమకు చేతనైనంతలో కొన్నిటినైనా బతికించుకోవాలని కలిసి కట్టుగా తీర్మానించుకున్నారు. అయితే అంత పెద్ద చెట్లను జాగ్రత్తగా వేళ్లతో సహా పద్ధతి ప్రకారం పెకలించి, వేరొక సురక్షిత ప్రాంతం లో వాటిని తిరిగి నాటి, వాటిని జీవింప జేయడానికి చాలా పెద్దమొత్తంలో డబ్బు అవసరమవుతుంది. దాన్ని ఎవరు భరించగలరు. అందుకే అంతా కలిసి విరాళాలు పోగుచేశారు. మొత్తం 3 లక్షల రూపాయలు పోగయ్యాయి. ఆ మొత్తంతో ఒక వేపచెట్టును, నాలుగు రావి చెట్లను బతికించుకోవటానికి నిశ్చయించుకున్నారు. వెంటనే అర్బన్ కన్జర్వేషనలిస్ట్ విజయ్ నిషాంత్‌ను కలిసి విషయం చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో మిగిలిన పని నడిచిం ది. ఆ పనిలో నిష్ణాతులైనవారిని చెన్నైనుంచి రప్పించారు. ఆ నాలుగు చెట్లను జాగ్రత్తగా వేళ్లతో సహా పెకలించి విల్లా కమ్యూనిటీలో వేప చెట్టును, మిగిలిన మూడు రావిచెట్లను సర్జాపూర్ రోడ్డులోనే ఉన్న ఇన్వెంచర్ అకాడెమీలో నాటారు. ప్రజలు ఈమాత్రం చేయగలిగినపుడు ఈ విషయంలో ప్రభుత్వం ఏంచేయ లేదా అని విజయ్ నిషాంత్ సూటిగా ప్రశ్నించారు. సర్జాపూర్ పౌరుల చేతన దేశంలోని మిగిలిన వారికీ స్ఫూర్తిని స్తుంది. చెట్లను కాపాడుకోవటంలో ఇదొక కొత్త ఆలోచన. చెట్లను కూల్చడం కాకుండా, తరలించడాన్నే అందరూ అనుసరించాలి. ఎన్నో దశకాలు ఎదిగితే కానీ అంతంత పెద్ద చెట్లు కావేవు అవి. అంతటి చెట్లను ఒక్క సారిగా కూల్చేస్తే, మళ్లీ అన్ని చెట్లు.. అంత పెద్దగా ఒక్కరోజులో సిద్ధంగా లేవు. అందుకే చెట్ల ప్రాణాలు నిలబెట్టి, జగతి క్షేమానికి కృషిచేయాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి ఒక్కరిదిగా భావించాలి.

చెట్టుతో చెలిమి..
మనిషికి ఆరోగ్య కలిమి!

‘సంఘీ’భావం

మాతా, శిశు మరణాలు ఆపాలి!

మానవాభివృద్ధికి సరైన కొలమానం ఆరోగ్యమే. ఆరోగ్యమే ఆర్థిక, సామాజిక, పర్యావరణ ప్రగతికి కీలకమవుతుంది. ఆరోగ్యం లేని వ్యక్తి, వ్యవస్థ అభివృద్ధి, వికాసం స్తంభించినట్లే.

డబ్బు పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. వ్యక్తిత్వం కోల్పోతే మంచి పనులతో మళ్లీ మంచి పేరు సంపాదించవచ్చు. కానీ ఒకసారి ఆరోగ్యం క్షీణిస్తే మళ్లీ ఆరోగ్యాన్ని పొందడం అసంభవం. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కుటుంబాలే కాకుండా ప్రభుత్వాలు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యక్తి ఆరోగ్యంతోనే సమాజ అభివృద్ధి ఆధారపడి ఉన్నదని అంతా గమనించాలి. ముఖ్యంగా పాలకులు ఆరోగ్యం మెరుగుదలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కాలంలో ఆందోళనకరంగా మాతా-శిశు మరణాలు పెరుగుతున్నాయి. ఎక్కువ మరణాలు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రుల్లోనే చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలకు కీలక ఆరోగ్య వైద్య ఆరోగ్య కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లోని ప్రముఖ సుల్తాన్ బజార్, నయాఫూల్, నీలోఫర్ ఆసుపత్రుల్లోనే మాతా-శిశు మరణాలు అసాధారణ రీతిలో పెరుగుతున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరణాలను ప్రైవేటు ఆసుపత్రుల్లో మరణాలను బేరీజు వేస్తే ప్రయివేటు ఆసుపత్రుల్లోనే తక్కువ మరణాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి కారణమేంటో ప్రభుత్వాలు శాస్త్రీయంగా పరిశీలించాలి. దీనికి బదులు ప్రభుత్వాలు మరో రకంగా ఆలోచించడం అసలు సమస్యను పరిష్కరించేదిగా కనిపించడం లేదు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగడంకోసం ఎంతో కాలంనుంచి ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో ఈ ప్రోత్సాహకాల నగదు చాలా తక్కువగా ఉండేది. దీంతో ఈ ప్రోత్సాహకాలను పట్టించుకోకుండా ఎక్కువ మంది సురక్షిత ప్రసవంకోసం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించేవారు. సర్కారు ఆసుపత్రికి వెళ్తే తల్లీ-బిడ్డ సురక్షితం కాదనే భావన ప్రతిఒక్కరిలో ఉంది. అయినా ఎక్కువ మంది పేద కుటుంబాలవారు లక్షల ఖర్చుతో ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లలేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ అడుగడుగునా అవినీతి, నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం చోటు చేసుకోవడంతో ఇవి గర్భిణుల పాలిట నరకానికి నకళ్లుగా మారాయి. తల్లీ-బిడ్డల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా పుట్టిన బిడ్డల తారుమారు చేసిన ఘన చరిత్ర ప్రభుత్వ ఆసుపత్రులది. ఇక ఈ ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక సౌకర్యాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇక్కడ సరైన సంఖ్యలో గర్భిణులకు పడకలే ఉండవు. ఒక్కో పడకపై ఇద్దరిని పడుకోబెట్టిన దయనీయ స్థితి ప్రధాన ఆసుపత్రుల్లో కనిపిస్తుంది. బెడ్ దొరికించుకున్నా ఆ తరువాత నర్సులుండరు. డాక్టర్లు దొరకరు. పారా మెడికల్ స్టాఫ్ అసలు కనిపించరు. అయినా తక్కువ ఖర్చుతో ప్రసవం అవుతుందని భావించి పేదలు ఈ ఆసుపత్రులకు వస్తున్నారు. ఇలాంటివారి పట్ల అంతా అమానవీయంగా వ్యవహరించడంతో తల్లీ-బిడ్డల ప్రాణాలంటే లెక్కలేకుండాపోయింది. అందుకే హైదరాబాద్‌లోనే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రులలో, పిల్లల హాస్పిటళ్లలో వందల మంది చనిపోతున్నారు. నిజానికి వీరందరికి సరైన సమయంలో సరైన వైద్యం అందితే మరణాల సంఖ్య చాలా తక్కువగా ఉంటుందని అంతా అంగీకరిస్తున్నారు. కానీ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రులను, పిల్లల ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో చక్కదిద్దడానికి ప్రయత్నాలు చేయడం లేదు. ఫలితంగానే తల్లీ-బిడ్డల శోకంతో ప్రసూతి, పిల్లల ఆసుపత్రులు అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితి తీవ్రతను గమనించిన తమిళనాడు ప్రభుత్వం తొలుత గర్భిణులకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని పెంచింది. అలాగే వారికి గర్భిణి సమయంలోనూ, ప్రసవం తరువాత ఇవ్వాల్సిన అన్ని రకాల మందులను, ఆహారాన్ని సరైన ప్రమాణాలతో ఇస్తున్నారు. అదేవిధంగా సరైన వైద్యాన్ని అందిస్తున్నారు. పుట్టిన పిల్లలకు వాక్సినేషన్ కూడా ఉచితంగా సకాలంలో అందిస్తున్నారు. దీనివల్ల కొంత ఫలితం కనిపిస్తున్నది.

అయితే మాతా-శిశు మరణాల నివారణకు ప్రభుత్వాలు తాత్కాలిక చర్యలు బదులు శాశ్వత చర్యలు తీసుకోవాలి. గర్భిణులకు ఆర్థిక సహాయాలను పెంచడానికి బదులు ముందుగా ప్రభుత్వ ప్రసూతి, పిల్లల ఆసుపత్రులను ప్రయివేటు స్థాయిలో మెరుగు పరచాలి. అప్పుడే పేదలు, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రసవాలకోసం వస్తారు. అలా కాకుండా ఇప్పుడున్న దుర్భర పరిస్థితుల్లోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగితే సహాయం ఇస్తామని షరతు పెట్టడం సరైనది కాదు. అసలు గర్భిణులంతా-తాము ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేసుకుంటామని ఉత్సాహంగా ముందుకు వచ్చేలా ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని సౌకర్యాలతో బలోపేతం చేయాలి. ఆపరేషన్ థియేటర్లు, బ్లడ్ బ్యాంకులు, డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, మెడికల్ సామాగ్రి, బెడ్‌ల కొరత లేకుండా చూడాలి. గ్రామీణ స్థాయిలో సబ్ సెంటర్ నుంచి నగరంలో ఆసుపత్రుల దాకా మహిళలు ప్రసవంకోసం ప్రభుత్వ ఆసుపత్రులనే సందర్శించేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ మంత్రసానుల ప్రసవాలు జరగడంతో మరణాలు పెరుగుతున్నాయి. తల్లి గర్భం దాల్చినప్పటినుంచి ప్రసవం, ఆ తరువాత మూడేళ్ల వరకు పాప ఆరోగ్యంగా ఉండేందుకు ఐరన్ మాత్రల నుంచి మల్టీ విటమిన్ టాబ్లెట్లు ఉచితంగా ఇవ్వాలి. ముఖ్యంగా మహిళల్లో అనీమియా సమస్య ఉంటుంది. దీనికి పరిష్కారం అవసరమయిన ఐరన్ ఇవ్వడమే. అలాగే పౌష్టికాహారాన్ని అన్ని స్థాయిల్లో గర్భిణిలకు ఆరోగ్యకరమైన రీతిలో అందించే విధంగా పాలకులు ప్రయత్నించాలి. గర్భిణులకు సంబంధించిన సమస్త సమాచారాన్ని డిజిటలైజ్ చేసి అవసరమైతే వారికి వైద్య సహాయాన్ని మొబైల్ ఫోన్లతో అందించే విధంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలి.

అన్నిటికన్నా ముఖ్యంగా సృష్టికి మూలమైన స్త్రీకి అందించే వైద్యం.. ఆరోగ్యం విషయంలో కల్తీని క్షమించలేం. ఇది అత్యంత అమానుషం. ఈ ఆసుపత్రులకు ఇచ్చే మందుల్లో కూడా కక్కుర్తి పడి కల్తీ చేయడం, కమిషన్లకు ఆశపడడం అత్యంత దారుణం. ఇలాంటి వారికి మరో జన్మలో కూడా ఇలాంటి పని చేయకుండా చేసే విధంగా కఠిన శిక్షలు అమలు చేయాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

మూడో కన్ను

– ఎ.వి.వి. ప్రసాద్

కర్ణన్..ఓ క్వశ్చన్‌మార్క్!

న్యాయ పీఠమెక్కి నగుబాటు పనులేల
దిమ్మ తిరిగిపోవు తీర్పులేల;
కర్ణనిపుడు పెద్ద క్వశ్చను మార్కాయె
విశ్వవినుత నామ! వినురవేమ!!

కర్ణన్ వ్యవహరించిన తీరును చూసి న్యాయకోవిదులే ఆశ్చర్యపోతున్నారు. న్యాయవ్యవస్థతో దాగుడుమూతలాడినవారు గతంలో కూడా కొందరు ఉన్నప్పటికీ 'న్యాయం' తెలిసిన ఒక న్యాయమూర్తి ఇలా వ్యవహరించడం న్యాయమేనా? అని వారు ప్రశ్నిస్తున్నారు. తోటి న్యాయమూర్తులపై కర్ణన్ చేసిన ఆరోపణలు కూడా న్యాయ పరీక్షకు నిలిచేవి కాదన్నది వారి అభిప్రాయం. జస్టిస్ పి.రామచంద్ర స్వామి, జస్టిస్ సౌమిత్రాసేన్, జస్టిస్ దినకరన్ వంటి న్యాయమూర్తులు కూడా గతంలో ఎంతో వివాదాస్పదులైనా కర్ణన్ ఉదంతం వారందరికంటె భిన్నమైదనీ, న్యాయవ్యవస్థకే ఆయన ఒక ప్రశ్నార్థకంగా మారారనీ వారి అభిప్రాయం. కోర్టు ధిక్కార నేరాలకు తీవ్రమైన శిక్షలు విధించే జడ్జి తానే ఆ నేరానికి పాల్పడడం 'న్యాయ' చరిత్రలోనే ఒక వింతగా వారు అభివర్ణిస్తున్నారు.

సమాజంలోని కీలక వ్యవస్థలు సైతం పట్టాలు తప్పుతున్నాయా? సామాన్యుల నుంచి సంపన్నుల వరకు తమకు న్యాయం కోసం పరితపించే న్యాయవ్యవస్థే విమర్శలకు గురవుతున్నదా? ఇలాంటి సందేహాలు కలిగే విధంగానే ఇటీవల అనేక పరిణామాలు సంభవిస్తున్నాయి. మిగతా వ్యవస్థల మాటెలా ఉన్నా, న్యాయవ్యవస్థ పట్ల మాత్రం దేశంలోని ప్రతి పౌరునికి సమున్నతమైన గౌరవమే ఉంటుంది. అది రాజ్యాంగం మనకు ప్రసాదించిన మహత్తరమైన వరం. అయితే అలాంటి అత్యున్నత వ్యవస్థ కూడా అప్పుడప్పుడు విమర్శల పాలవడమే విచారించవలసిన అంశం. నాలుగు ప్రధాన వ్యవస్థలలో ఒకటైన న్యాయవ్యవస్థ పనితీరు పట్ల కొందరు మేధావులు తరచుగా అసంతృప్తిని వ్యక్తం చేయడం కూడ ఇటీవల ఎక్కువవుతున్నదంటే ఎక్కడో ఏదో లోపం ఉన్నదనే అనిపిస్తుంది. ఆ లోపాన్ని గుర్తించి దాన్ని సరిదిద్దే ప్రయత్నం ఎంతవరకు జరుగుతున్నదో తెలియదుగాని విమర్శలు మాత్రం రానురాను ఎక్కువవుతున్నాయనే అభిప్రాయమే వినిపిస్తోంది.

అటువంటి విమర్శలు వినిపించ డానికి కారణమవుతున్న తాజా వివాదానికి కేంద్రబిందువు జస్టిస్ కర్ణన్. ఆయన చాలాకాలం నుండి రకరకాల వివాదాలలో చిక్కుకుంటున్నా తాజా వివాదం మాత్రం ఆయన వల్ల న్యాయవ్యవస్థ తీవ్ర విమర్శల పాలయ్యే పరిస్థితి తెచ్చిందనడంలో ఎలాంటి సందేహం లేదనిపిస్తుంది. ఆయన ఢీకొన్నది సుప్రీంకోర్టుతో, ఆ న్యాయమూర్తులతో కావడం వివాదాన్ని మరింతగా చర్చనీయాంశం చేసింది.

కర్ణన్ ప్రస్తుతం కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. ఆ హోదాలో ఉంటూ ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు శిక్ష విధించారు. అందుకు ఆయన కారణాలు ఆయనకు ఉండి ఉండవచ్చు. ఆయన దృష్టిలో అవి సహేతుకమైనవే అయి ఉండవచ్చు. న్యాయవ్యవస్థలో అంచెలంచెలుగా ఎదిగి ఒక హైకోర్టు జడ్జి స్థాయికి వచ్చినవారు గనుక ఆయన తీసుకునే నిర్ణయాలు, చర్యలు నిర్హేతుకమని చెప్పడం కూడా కష్టమే. కానీ ఆయన పరిధిని, స్థాయిని ప్రశ్నించే విధంగా ఆయన తీసుకొన్న చర్యలు ఇటీవల వివాదాస్పదం కావడం వల్లే ప్రజలలోను, మీడియాలోను ఆయన అంతగా చర్చనీయాంశమయ్యారనిపిస్తుంది.

కర్ణన్ శిక్ష విధించగానే సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా ఆయనకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పి వెంటనే అరెస్టు చేయాలని కూడా ఆదేశాలు జారీచేసింది. మే 9న తేదీన సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆ తీర్పు దేశమంతా ఎంతగానో సంచలనం కలిగించింది. ఎందుకంటే ఒక సిట్టింగ్ జడ్జికి జైలు శిక్ష విధించడం గత ఆరున్నర దశాబ్దాలలో ఎక్కడా వినలేదు, కనలేదు గనుక. భారత న్యాయవ్యవస్థలోనే ఇది ఒక అసాధారణ, అపూర్వ పరిణామం. కోర్టు ధిక్కరణ అభియోగంలో జస్టిస్ కర్ణన్‌ను దోషిగా తేల్చిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆయనకు 6 నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పింది. ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి నాయకత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్ ఆ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు వింటే న్యాయవ్యవస్థ పట్ల గౌరవం గల వారందరి కనులు తప్పక చెమర్చి ఉంటాయనే అనిపిస్తుంది.

కర్ణన్ వైఖరిని చూసి ఆయన మానసిక పరిస్థితి సక్రమంగా ఉన్నదా? లేదా? అనే అనుమానం కూడా ఒక దశలో సుప్రీంకోర్టుకు కలిగింది. ఆయనకు వైద్య పరీక్షలు జరిపించాలని కూడా ఆదేశించింది. అయితే తన నివాసానికి వైద్య బృందంతో వచ్చిన డిజిపికి కర్ణన్ డాక్టర్ సర్టిఫికెట్‌ను ఇస్తూ 'నేను బాగానే ఉన్నాను. నేను జారీ చేసిన ఆదేశాలన్నీ వివేకంతో చేసినవే' అని చెప్పడంతో ఆయన కావాలనే సుప్రీం కోర్టును ఢీకొన్నారని కూడా స్పష్ట మవుతుంది. ఆయన చర్యలన్నిటిని చాలా రోజులుగా సుప్రీంకోర్టు సహిస్తూనే వచ్చిందిగానీ తన జడ్జిలకే ఆయన శిక్ష వేయడాన్ని మాత్రం అంగీకరించలేకపోయింది. ఆయన తన పరిధులను ఎప్పుడైతే అతిక్రమించారో అక్కడ సుప్రీంకోర్టు తన వద్దగల వజ్రాయుధాన్ని ప్రయోగించింది. 'చట్టం సామాన్యుడికైనా, న్యాయమూర్తికైనా ఒక్కటే' అన్నది నిరూపించే విధంగా సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. తోటి హైకోర్టు జడ్జిలపై, సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు చేసిన జస్టిస్ కర్ణన్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం మార్చి 10వ తేదీన కోర్టు ధిక్కరణ నేరం కింద బెయిలబుల్ వారంటు జారీ చేసింది. న్యాయ సంబంధమైన విధులు నిర్వహించ కుండా కూడా ఆదేశాలు జారీచేసింది. తన అధికారాల పునరుద్ధరణ కోసం మార్చి 31న జస్టిస్ కర్ణన్ చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తిరస్కరించింది. తాను దళితుడినైనందునే తనను అవమానిస్తున్నా రంటూ కర్ణన్ మళ్లీ మళ్లీ అవే ఆరోపణలు చేయడంతో, అక్కడితో ఆగక న్యాయమూర్తులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంకింద కేసు నమోదు చేసి సుమోటోగా విచారణ చేపట్టడంతో పరిధిని ఇంతలా ఆయన ఉల్లంఘించడానికి కారణాలు అన్వేషిస్తూ మొదటగా ఆయన మానసికస్థితిని పరిశీలించడానికి వైద్య పరీక్షలు జరిపించవలసిందిగా

సుప్రీంకోర్టు ఆదేశించింది. అది మొదలు వివాదం మరింతగా ముదిరి ఒకరికొకరు జైలుశిక్షలు విధించుకొనేదాకా వెళ్లింది. సుప్రీంకోర్టు ఆదేశానుసారం కర్ణన్‌ను అరెస్టు చేయడానికి ఢిల్లీ నుండి పోలీసు ఉన్నతాధికారులు తొలుత కోల్‌కతాకు, అక్కడ ఆయన లేకపోవడంతో చెన్నైకి బయల్దేరడంతో ఒక క్రిమినల్‌గా ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోవలసి వచ్చింది. ఇలాంటి నాటకీయ వివాదాస్పద ఉదంతం ఆరున్నర దశాబ్దాల భారత న్యాయవ్యవస్థలో బహుశా ఇది మొదటిదేమో! అందుకే దేశవ్యాప్తంగా అంతటి సంచలనం కలిగించింది.

****

కర్ణన్ వ్యవహరించిన తీరును చూసి న్యాయ కోవిదులే ఆశ్చర్యపోతున్నారు. న్యాయవ్యవస్థతో దాగుడుమూతలాడినవారు గతంలో కూడా కొందరు ఉన్నప్పటికీ 'న్యాయం' తెలిసిన ఒక న్యాయమూర్తి ఇలా వ్యవహరించడం న్యాయమేనా? అని వారు ప్రశ్నిస్తున్నారు. తోటి న్యాయమూర్తులపై కర్ణన్ చేసిన ఆరోపణలు కూడా న్యాయ పరీక్షకు నిలిచేవి కాదన్నది వారి అభిప్రాయం. జస్టిస్ పి.రామచంద్ర స్వామి, జస్టిస్ సౌమిత్రాసేన్, జస్టిస్ దినకరన్ వంటి న్యాయ మూర్తులు కూడా గతంలో ఎంతో వివాదాస్పదులైనా కర్ణన్ ఉదంతం వారందరికంటె భిన్నమైనదనీ, న్యాయవ్యవస్థకే ఆయన ఒక ప్రశ్నార్థకంగా మారారనీ వారి అభిప్రాయం. కోర్టు ధిక్కార నేరాలకు తీవ్రమైన శిక్షలు విధించే జడ్జి తానే ఆ నేరానికి పాల్పడడం 'న్యాయ' చరిత్రలోనే ఒక వింతగా వారు అభివర్ణిస్తున్నారు.

జస్టిస్ కర్ణన్‌కు చట్టాలలోని లొసుగులన్నీ బాగా తెలుసు గనుకనే సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఆయన శిక్షలు విధించారన్నది మరో అభిప్రాయం. పదవిలో ఉన్న న్యాయమూర్తికి సుప్రీంకోర్టయినా శిక్ష విధించవచ్చునా? అన్నది మరో ధర్మసందేహం. కర్ణన్ చేసిన ఆరోపణలు నిజానికి విచారణకు నిలబడేవి కాదనీ, ఆయన చిత్త వ్యాకులత వల్లనే అలాంటి ఆరోపణలు చేశారనీ మరికొందరి అభిప్రాయం.

వాటిలో ఏది ఎలా ఉన్నా, ఇంతవరకు ఏ ఒక్క జడ్జి తొక్కని దారిని తొక్కారన్నది మాత్రం వాస్తవం. పదవిలో ఉండగా శిక్షను ఎదుర్కొన్న మొదటి న్యాయమూర్తిగా కర్ణన్ చరిత్రలో మిగిలిపోతా రన్నది మరో వాస్తవం. తాను చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు చూపకుండా న్యాయ వ్యవస్థలో కల్లోలం రేపిన న్యాయమూర్తిగా ఇప్పటికే ఆయన ఎంతో అపఖ్యాతిని మూటకట్టు కొన్నారు. ఈ విషయంలో, గతంలో వివాదాస్పదులైన జడ్జిలకు, కర్ణన్‌కు మధ్య కొన్ని వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తాయి. అపఖ్యాతి రాగానే వారు రాజీనామాలు చేసి న్యాయవ్యవస్థ గౌరవానికి ఎటువంటి భంగం వాటిల్లకుండా జాగ్రత్త పడ్డారు. అయితే పదవీ విరమణకు దగ్గర పడడంవల్లనో ఏమో! కర్ణన్ రాజీనామాకు ససేమిరా అంటున్నారు.

గతంలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ సౌమిత్రా సేన్‌ను పదవినుండి తొలగించడానికి పార్లమెంటు ఆమోదం కోసం ప్రయత్నించిన సందర్భంలో రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందగానే ఆయన పదవికి రాజీనామా చేసేశారు. అలా అభిశంసన నుండి బయటపడి పరువు దక్కించుకొన్నారు. అలాగే సిక్కిం హైకోర్టు న్యాయమూర్తిగా చేసిన జస్టిస్ దినకరన్ కూడా 2011లో ఆర్థికపరమైన అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు రావడంతో చర్యలు తీసుకొనడానికి ముందే రాజీనామా చేసి మరిన్ని అవమానాలకు గురి కాకుండా బయటపడ్డారు. ఇక అభిశంసన ప్రక్రియను ఎదుర్కొన్న మొదటి న్యాయమూర్తిగా సుప్రీంకోర్టు జడ్జి అయిన జస్టిస్ పి.రామస్వామిని చెప్పవలసి ఉంటుంది. అప్పట్లో ఆయనపై చాలా అవినీతి ఆరోపణలే వచ్చాయి. అధికార దుర్వినియోగం ఆరోపణల కింద ఆయనను అభిశంసించే ప్రక్రియ పార్లమెంటుదాకా వెళ్లింది కూడా. 1993లో లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో కాంగ్రెస్, దాని కూటమి పార్టీలు పాల్గొనకపోవడంతో అభిశంసన బిల్లు వీగిపోయిందిగాని ఆయనకు వచ్చిన అపఖ్యాతి మాత్రం అలాగే మిగిలిపోయింది.

ఇలా గతంలో కూడా వివాదాస్పదులైన కొందరు న్యాయ మూర్తులు ఉన్నప్పటికి జస్టిస్ కర్ణన్ వంటి అత్యధిక వివాదాస్పదుడు మరొకరు లేరన్నదే పలువురి అభిప్రాయం. ఆయన వివాదాల చరిత్ర నిజానికి కొత్తదేమీ కాదు. 2009 నుంచే మొదలయినట్లు కనిపిస్తుంది. ఆయన తొలిసారి జడ్జి సీటు అధిరోహించినప్పటి నుండి వివాదాల వలయంలోనే చిక్కుకొన్నారు. తాను దళితుడినైనందునే మిగిలిన జడ్జిలు తనను అవమానిస్తున్నారంటూ ఎస్‌సి నేషనల్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా 2011లో ఆయన తొలిసారి వార్తల్లో సంచలన వ్యక్తిగా మారారు. తన పక్కన కూర్చున్న జడ్జి కాలితో తనను తాకాడనీ, ఇది న్యాయ వ్యవస్థలోని కుల వివక్షకు అద్దం పడుతున్నదనీ అప్పట్లో ఆయన చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా ఎంతో సంచలనం కలిగించడమే గాక న్యాయవ్యవస్థను సైతం ఓ కుదురు కుదిపాయి.

తర్వాత మరో సందర్భంలో జడ్జిల ఎంపికలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ కోర్టు విచారణ గదిలోకి ఆయన దూసుకు వెళ్లడం కూడా అప్పట్లో పెనుసంచలనం కలిగించింది. దానిపై ఆయనను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది కూడా. ఇలా ప్రతి సంవత్సరం ఆయన ఏదో ఒక వివాదానికి గురవుతూనే ఉన్నారు. మద్రాసు హైకోర్టులో ఉన్నప్పుడు ప్రధాన న్యాయమూర్తి సంజయ్ కిషన్ తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఆయనపై సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టడంతో జస్టిస్ కర్ణన్ పేరు 2015లో మరోసారి దేశమంతా మార్మోగిపోయింది. ఇంకా విచిత్రమేమంటే 2016 ఫిబ్రవరిలో తనను కోల్‌కతా హైకోర్టుకు బదిలీ చేయడంపై జస్టిస్ కర్ణనే స్టే విధించడం. దానిపై సుప్రీంకోర్టు ఆగ్రహించి ఆయన అధికారాలకు కత్తెర వేసింది. అప్పటినుంచి తీవ్ర స్థాయికి చేరిన వివాదం కర్ణన్ 'సుప్రీం' న్యాయమూర్తులు ఒకరిపై ఒకరు జైలుశిక్షలు విధించుకొనేదాకా వెళ్లింది. ఆరున్నర దశాబ్దాల న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల మధ్య ఇంతటి పెద్ద తగాదా కూడా ఇది ఒక్కటే.

సాధారణ వ్యక్తులకే ఎంతో క్రమశిక్షణ అవసరమని చెబుతున్నపుడు న్యాయమూర్తు లకు ఇంకెంత ఉండాలి? అనే సందేహం కూడా కర్ణన్ ఉదంతం నుంచి అందరిలో కలుగుతోంది. దాదాపు 20 మంది న్యాయమూర్తులపై ఆయన అవినీతి ఆరోపణలు చేశారు. వాటిలో నిజమెంత ఉన్నా సాధారణ ప్రజల్లో వారిపై ఎన్నో అనుమానాలను కలిగించాయన్నది మాత్రం వాస్తవం. ఆయన ఆరోపణలు నిజమైతే వ్యవస్థకు ఎలా చెదలు పడుతున్నవో బయట పడినట్లవుతుంది. కానిపక్షంలో జడ్జి హోదాలో ఉన్న వ్యక్తి ఎంత చౌకబారు ధోరణితో వ్యవహరించారో అర్థమవుతుంది. ఇది న్యాయవ్యవస్థకే ఓ పరీక్ష అనుకోవాలి. ఈ పరీక్షలో వ్యవస్థకు ఎన్ని మార్కులు వస్తాయో ఆ 'న్యాయదేవతే' చెప్పాలి. ఏది ఏమైనా న్యాయవ్యవస్థ తనను తాను సమీక్షించుకోవలసిన పరిస్థితి ఆసన్నమైందనిపిస్తుంది.

ఉగ్రం..మహోగ్రం!

ఆపేదెలా! ఆర్పేదెలా?

కవర్ స్టోరీ

డి.మురళీధర్ అమర్‌నాథ్
క్రైం రిపోర్టర్, స్టేట్‌బ్యూరో

ప్రస్తుతకాలంలో ప్రపంచం ఎదుర్కొంటోన్న ప్రచండ సమస్య 'ఉగ్రవాదం'. ఈ ఉగ్రవాద భూతం కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అమాయకులెందరో నేలరాలుతున్నారు. అసంఖ్యాక ప్రజ కడుపునిండా తిండిలేక, కంటినిండా నిదురలేక, తమ అస్తిత్వాలను కోల్పోయి, భయంతో, బాధతో మాతృభూములను విడిచి, పరాయి పంచల్లో తలదాచుకొంటూ జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. ఉగ్రవాదం ఎంతటి మహోగ్రంగా ఉందంటే..2015లో ప్యారిస్‌లో జరిగిన దాడి, ఆపైన 2016 జులైలో జరిగిన దాడికి మధ్యలో వెయ్యికి పైగా దాడులు జరిగాయి. అందులో ముఖ్యమైనవి యుఎస్, బంగ్లాదేశ్, ఇరాక్, ఫ్రాన్స్, ఇస్తాంబుల్ మొదలైనవి చెప్పుకోవచ్చు. ప్రపంచంలో ఏ క్షణంలో ఎక్కడ ఏ రూపంలో ఉగ్రవాదం విరుచుకుపడి విషాదానికి తెరతీస్తుందో తెలియని పరిస్థితి. అనుక్షణం..అంతటా.. భయం..భయం.. **మే 21 ఉగ్రవాద వ్యతిరేకదినం** సందర్భంగా మనిషిని మనిషే మట్టుబెట్టే ఉగ్రవాదం గురించి ఈవారం మీకోసం..

నేడు ప్రపంచ దేశాలను వణికిస్తున్నది ఉగ్రవాదం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆకలితో అలమటిస్తున్న దేశాల నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాలు మొదలుకొని సంపన్న దేశాల వరకు దాదాపు అన్ని దేశాలను ఉగ్రభూతం వణికిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 160కి పైగా దేశాలలో ఏటా వందలాది ఉగ్రవాద దాడులు జరుగుతుండగా వేలాది మంది బలవుతున్నారు. ఇదే సమయంలో ఇంతకు నాలుగింతల మంది క్షతగాత్రు లవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదంపై సర్వే చేసిన ఓ అంతర్జాతీయ సంస్థ అనేక సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. ఇందులో భారత్‌లో ఉగ్రవాదం కొంతమేర తగ్గిందని గణాంకాలు చెబుతున్నా పొరుగునే వున్న పాకిస్థాన్‌తో పాటు బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లో టెర్రరిజం బాగా పెరిగిందనే నిజం ఇండియాకు పక్కలో బల్లెంగా నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఉగ్రవాద సమస్య ఎక్కువగా వుండగా ఇందులో ఆసియాలో ఖండంలోని దేశాలే ఇబ్బందులు పడుతున్నట్లు ఆ సర్వేలో తేలింది.

భారత్‌లో ఉగ్రవాదానికి బీజం పడింది 1980 దశకంలో. పంజాబ్ రాష్ట్రానికి స్వతంత్రం కావాలనే నినాదంతో మొదలైన ఖలిస్తాన్ ఉద్యమం, ఆ తరువాత జమ్మూకాశ్మీర్‌లో 1990 దశకంలో మొదలైన ఘటనలు దీనికి మరింత ఊతం ఇచ్చాయి. ఇక ఇండియాలో ఉగ్రమూకలు పెట్రేగడం మాత్రం 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం తరువాతేనని చెప్పాలి. అప్పట్లో మొదలైన ఉగ్రవాద కార్యకలాపాలు నేటికీ భారత్‌నూ ఏదో ఒక రూపంలో వణికిస్తూనే వుండడం విశేషం. మరోవైపు భారత్‌లో ఉగ్రవాద కార్య కలాపాలు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నా పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రమూక లతో పాటు కొత్తగా ఇండియాలో పాగా వేసేందుకు యత్నిస్తున్న ఇస్లామిక్ స్టేట్స్ ఉగ్రవాద సంస్థతో రాబోయే రోజుల్లో కొత్త చిక్కులు తలెత్తే అవకాశాలున్నాయని నిపుణులు అంటున్నారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు నిఘా వర్గాలను పటిష్టం చేయడంతో పాటు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలను బలోపేతం చేయాల్సిన అవసరం వుందని నిపుణులు చెబుతున్నారు.

ఉగ్రవాదం అనేది ఇప్పుడు అన్ని దేశాలకు ఆకలి, పేదరికంకన్నా అతిపెద్ద సమస్యగా మారింది. ఒకప్పుడు కేవలం కొన్ని దేశాలలోనే ఈ సమస్య వుండగా నేడు దాదాపు అన్ని దేశాలకు ఉగ్రవాదం అతి పెద్ద సమస్యగా మారడం గమనార్హం. ఆసియాను గమనిస్తే

పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, ఇరాక్, సౌదీ అరేబియా, సిరియా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాలలో ఉగ్రవాద సమస్య ఇటీవల కాలంలో తీవ్రంగా మారింది. మధ్య ఆసియా దేశాలలో ఉగ్రవాదాన్ని ప్రేరేపించి ఆ దేశాలలోని ఆయిల్ నిక్షేపాలను సులభంగా చేజిక్కించుకునేందుకు అమెరికా 1980 దశకంలో సౌదీ అరేబియాకు చెందిన సంపన్న వ్యాపారి ఒసామా బిన్ లాడెన్‌ను వాడుకుని చాలా వరకు లబ్ధి పొందింది. ఈ నేపథ్యంలోనే మధ్య ఆసియాలోని పలు దేశాల్లో ఉగ్రవాదకార్యకలాపాలకు 1980లో బీజం పడింది. అయితే ఇరాక్‌పై అమెరికా దాడి తరువాత లాడెన్ ఒక్కసారిగా ఎదురు తిరిగి అదే దేశంపై దాడులకు వ్యూహం రచించే స్థాయికి ఎదిగాడు. ఈ క్రమంలోనే అమెరికాపై ఒసామా బిన్ లాడెన్ నేతృత్వంలోని అల్ ఖయిదా ఉగ్రవాదులు 2001లో జరిపిన భయానక దాడులు ఆ దేశంతో పాటు అనేక దేశాలను నేటికీ వణికిస్తున్నాయి. దీని తరువాత ఒసామా బిన్ లాడెన్ ఉగ్రవాదులకు సహాయం చేయడంతో పాటు తానే కొత్తగా ఒక ఉగ్రవాద సంస్థను స్థాపించి అమెరికాతో పాటు పలు యూరప్ దేశాలపై దాడులకు దిగడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాద దాడులు కొత్త రూపం సంతరించుకున్నాయి. అమెరికాపై జరిగిన దాడుల తరువాత ఆ దేశం ఆఫ్ఘనిస్థాన్‌లోని అల్ ఖయిదా స్థావరాలపై, ఇతర దేశాలలో వున్న ఆ సంస్థ స్థావరాలపై దాడులు చేసి చాలా వరకు నష్టం కలిగించినా అల్ ఖయిదా కార్యకలాపాలు మాత్రం ఇంకా కొనసాగుతూనే వున్నాయి.

2011లో పాకిస్తాన్‌లోని ఆబోటాబాద్‌లో లాడెన్‌ను అమెరికా కమెండోలు కాల్చి చంపిన తరువాత అల్ ఖయిదా గతంలో వున్నంత బలంగా లేకున్నా ఆఫ్రికా దేశాలలో బోకోహరామ్‌తో పాటు మరికొన్ని ఉగ్రవాద సంస్థలతో జతకట్టి అక్కడి దేశాలను వణికిస్తోంది. ఇక భారత్‌కు పొరుగునే వున్న పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ వరకు వస్తే తాలిబన్లు పెను సమస్యగా మారారు. ఈ రెండు దేశాల్లో ఉగ్రవాద దాడులు జరగని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలు నిత్యం ఉగ్రవాద దాడులలో భీతిల్లుతున్నాయి.

ఈ సమస్య ఇప్పుడు పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న ఇరాన్‌ను చుట్టిముట్టింది. ఈ విషయంలో పాక్‌పై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం విశేషం. సున్నీ దేశమైన సౌదీ అరేబియా, షియా పరిపాలనలో వున్న ఇరాన్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులుండడంతో రెండు దేశాలలోని ఉగ్రవాద సంస్థలు పెట్రేగి పోతున్నాయి. ఇరాక్‌లో అయితే నిత్యం బాంబుదాడులేనని చెప్పడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. ఈ దేశం అణ్వస్త్రాలు దాచి వుంచిందనే నెపంతో అమెరికా దాడులు చేసి సద్దాం హుస్సేన్‌ను పదవి నుంచి దించిన తరువాత అక్కడ షియా, సున్నీ, కుర్దు వర్గాల మధ్య దశాబ్దన్నర క్రితం ఏర్పడ్డ వైరం నేటికీ కొనసాగుతుండడంతో ఆ దేశం నిత్యం రావణకాష్టంగా మారింది.

ఈ క్రమంలోనే ఇరాక్‌కు పక్కనే వున్న సిరియాలో నెలకొన్న పరిస్థితులు ఇస్లామిక్ స్టేట్స్ (ఐసిస్) అనే కొత్త ఉగ్రవాద సంస్థ ఆవిర్భావానికి బీజం పోశాయి. పదేళ్ల క్రితం ఏర్పాటైన ఐసిస్ మొదట్లో కేవలం ఇరాక్, సిరియాతో పాటు దాని పక్కనే వున్న కొన్ని అతి పేదదేశాలలో విధ్వంసాలు నిర్వహించగా నేడు సంపన్న దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, బ్రెజిల్, కెనడా, అమెరికా తదితర దేశాలలో బీభత్స తరహాలో దాడులు చేసే స్థాయికి ఎదిగింది.

ప్రస్తుతం ప్రపంచంలోని భయానక ఉగ్రవాద సంస్థల్లో ఇస్లామిక్ స్టేట్స్ మొదటి స్థానంలో వుండగా దాని తరువాత తాలిబన్లు, బోకో హరామ్ వంటి సంస్థలు వున్నాయి. బోకో హరామ్ సంస్థ ఆఫ్రికాలోని పలు దేశాలను ఇప్పటికీ వణికిస్తోంది. పసిపిల్లలను ముఖ్యంగా

అమ్మాయిలను కిడ్నాప్ చేయడం, ఏళ్ల తరబడి వారిని నిర్బంధించడం, ఇందులో కొందరిని ఉగ్రవాదులుగా మార్చడం వంటివి చేస్తూ ఆఫ్రికా దేశాలను బోకోహరాం వణికిస్తోంది.

కాగా ఇస్లామిక్ స్టేట్స్, బోకోహరాం, తాలిబన్లు ఇతర ఉగ్రవాద సంస్థలను పూర్తిగా అణచి వేసేందుకు అమెరికాతో సహా పలు అభివృద్ధి చెందిన దేశాలు ఇటీవలే ముందుకు రావడం శుభసూచకం. 2001 దాడుల తరువాత అమెరికాకు ఉగ్రవాద దాడుల గురించి తెలిసిరాగా ఇటీవల ఐసిస్ జరిపిన భయానక దాడుల తరువాత ఫ్రాన్స్ తదితర దేశాలు కళ్లు తెరిచాయి. ఉగ్రవాద సమస్యతో సతమతమవుతున్న దేశంలో రష్యా కూడా వుండడం గమనార్హం. ఆ దేశంలో పొరుగునే వున్న కజకిస్థాన్ ఉగ్రవాద ముఠాలు తరచూ దాడులు చేస్తూనే వున్నాయి. ఈ ముఠాలకు తాజాగా ఇస్లామిక్ స్టేట్స్ జత కలిశాయి. రష్యాలోని ఓ ప్రధాన నగరంలోని మెట్రో రైల్వే స్టేషన్‌లో జరిగిన బాంబుదాడులు ఇందుకు ఉదాహరణగా చెప్పాలి.

ఇండియా విషయానికి వస్తే 1980 దశకంలో పంజాబ్ రాష్ట్రానికి స్వతంత్రం కావాలనే నెపంతో మొదలైన ఖలిస్థాన్ ఉద్యమం అప్పట్లో దేశ వ్యాప్తంగా పెను సంచలనం రేపింది. ఖలిస్థాన్ ఉద్యమం చాలా కాలం వరకు సాగింది. చివరకు ఆపరేషన్ బ్లూ స్టార్‌తో స్వర్ణ దేవాలయంపై సైనికుల దాడి, ఈ క్రమంలో ఖలిస్థాన్ చీఫ్ బింద్రన్ వాలెతో పాటు పలువురు మరణించడం జరిగాయి. దీని తరువాత ఉగ్రవాదులు రెచ్చిపోయి నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీని, అప్పట్లో ఆర్మీ చీఫ్‌గా వున్న అరుణ్ కుమార్ శ్రీధర్ వైద్యను కాల్చి చంపారు. ఈ రెండు ఘటనల తరువాత పంజాబ్‌లో ఖలిస్థాన్ ఉగ్రవాదుల ఏరివేతకు నాటి పంజాబ్ డిజి కన్వర్‌పాల్ సింగ్ గిల్ చేబట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. దీని తరువాత 1990 దశకంలో జమ్మూ కాశ్మీర్‌లో జెకెఎల్ఎఫ్ సంస్థ చేబట్టిన స్వతంత్ర ఉద్యమం ఉగ్రవాదానికి మరింత ఊతం ఇచ్చింది. అప్పట్లో కాశ్మీర్‌లో రాజుకున్న ఉగ్ర బీజం నేటికి కోరలు చాస్తూనే వుంది. దీని తరువాత 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత ఇండియాలో ఉగ్రవాద కార్యకాపాలు మరింత పెరిగాయని చెప్పాలి. కాగా అంతకు ముందు 1991లో శ్రీలంకలో ఎల్‌టిటిఇ ఉగ్రవాద సంస్థకు వ్యతిరే కంగా చర్యలు చేబట్టినందుకు ఆ సంస్థ చేబట్టిన ఆత్మాహుతి దాడిలో నాటి విపక్ష నేత రాజీవ్ గాంధీ బలయ్యారు. మద్రాసులో జరిగిన ఈ ఘటన తరువాత ఎల్‌టిటిఇపై భారత్‌తో పాటు శ్రీలంకలు కఠిన వైఖరి అవలంబించి ఆ సంస్థను చావుదెబ్బతీశాయి.

అయితే బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత ఇండియాలో ఉగ్రవాదం మరింత విజృంభించింది. ఇందుకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ ప్రేరేపిత సంస్థలు ఇక్కడి యువతకు సహకరించడంతో 1992 నుంచి వరుసగా అనేక నగరాలలో బాంబు దాడులు జరుగుతూనే వున్నాయి. ఇందులో 1993లో ముంబయిలో జరిగిన వరుస పేలుళ్లు, 2008లో ముంబయిలోనే తాజ్ హోటల్‌పై జరిగిన భయానక దాడి, ముంబయి లోనే రెండు సార్లు జరిగిన బాంబు దాడులు,

ఉగ్రవాదం..ఒక అవలోకనం

ఉగ్రవాద భూతం గురించి ప్రపంచం మొత్తం ఆందోళన చెందుతున్న నేపథ్యంలో అసలు ఉగ్రవాదం అంటే ఏమిటి, ఉగ్రవాదం ఎందుకు తలెత్తుతుంది? ఉగ్రవాదంలో రకాలు, ఏవి ఎందుకు, ఎలా పనిచేస్తుంటాయి? అన్న అంశాలను అవగతం చేసుకోవటం ఎంతైనా అవసరం.

ఉగ్రవాదం అంటే...రాజకీయ, మత లేదా ప్రత్యేకవాదాలకు సబంధించిన లక్ష్యాలను సిద్ధింపజేసుకోవటం కోసం చట్ట విరుద్ధంగా వ్యక్తులపై లేదా ఆస్తులపై హింసకు పాల్పడి, తద్వారా ఆయా ప్రభుత్వాలను, సమాజాలను భయపెట్టి, వారిపై తమ జులుం చెలాయించటం' అని ఎఫ్‌బిఐ (ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) నిర్వచించింది.

ఉగ్రవాదం ముఖ్యంగా రెండు రకాలు. 1. జాతీయ ఉగ్రవాదం (నేషనల్ టెర్రరిజం). ఇది, విదేశీ జోక్యం లేకుండా..తన గ్రూపులతో జాతీయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలు చేపడుతుంది. ఇందుకు ఉదాహరణగా ఒక్లహోమా సిటీ బాంబింగ్‌ను చెప్పుకోవచ్చు. 2. అంతర్జాతీయ ఉగ్రవాదం (ఇంటర్నేషనల్ టెర్రరిజం)లో గ్రూపులు, విదేశీ లేదా విదేశీ గ్రూపుల ఆదేశాలపైన కార్యకలాపాలు సాగిస్తుంటాయి. సెప్టెంబర్ 11 ఉదంతాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఉగ్రవాదానికి కారణాలు ఏమిటని విశ్లేషిస్తే రాజకీయ, సామాజిక అన్యాయాలు; హింసతోనే లక్ష్యాల సాధన అనే ఉన్మత్త ఆలోచన; మతమౌఢ్యం; నిరక్షరాస్యత; హింస పట్ల క్రేజ్ కలిగి ఉండటం.

రాజకీయ, సామాజిక అన్యాయాలు ఉగ్రవాదానికి దారితీస్తాయన్నదానికి ఉదాహరణ..1980లో ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ ఇంగ్లీష్‌వారిపై బాంబుదాడికి దిగింది. న్యాయపరంగా తమదైన భూమిని బ్రిటిష్ ఇంపీరియలిస్టులు స్వాధీనం చేసుకున్నారన్న ఆవేదనతో, ఆగ్రహంతో వారు హింసకు ఒడిగట్టారు.

ఇక హింస, బెదిరింపులు తప్ప తమ లక్ష్యసాధనకు మరో మార్గంలేదని నమ్మడం కూడా ఉగ్రవాదానికి కారణమవుతోంది.

మతం కూడా ఉగ్రవాదానికి కారణమయి, మారణహోమానికి దారితీస్తోంది. చాలామంది ఉగ్రవాదులు మతాన్ని తప్పుగా అర్థంచేసు కుంటున్నారు, అన్వయించుకుంటున్నారు. 1980 నుంచి మతవిద్వేషాల కారణంగా ఉగ్రవాద కార్యకలాపాలు మరింతగా పెరిగినట్లు జరిగిన ఉదంతాలు తెలుపుతున్నాయి.

నిరక్షరాస్యత కూడా ఉగ్రవాదం పెచ్చరిల్లడానికి ఊతమిస్తోంది. విద్యావంతులు కాకపోవడం వల్ల ఉచితం, అనుచితం అనే విచక్షణ, ఆలోచన లేకపోవడం వల్ల నేరాలు చేయడానికి తొందరగా ప్రేరేపితులవుతున్నారు. సులభంగా ఉగ్రవాదుల వలలో పడి హింసకు పాల్పడుతున్నారు.

చాలామంది ఉగ్రవాదులు ఉన్మాదులు. హింసాత్మక చర్యలు వారికో పెద్ద క్రేజ్‌గా కూడా మారాయి.

ఉగ్రవాదం అంతమై, మానవత్వం వెల్లివిరిసినపుడే ప్రపంచమంతా శాంతి కుసుమాలు విరబూస్తాయి. స్వార్థ రాజకీయాలను విడనాడి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా కృషిచేయటమే తక్షణ కర్తవ్యం.

హైదరాబాద్‌లో 2007లో లుంబినీ పార్క్, గోకుల్ ఛాట్ జంట పేలుళ్లు, అంతకు ముందు బేగంపేట్‌లోని హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ కార్యాలయంపై జరిగిన ఆత్మాహుతి దాడి, 2013లో దిల్‌సుక్‌నగర్ జంట పేలుళ్లు ముఖ్యమైనవిగా చెప్పాలి. దీంతో పాటు బెంగుళూరులో శాస్త్రవేత్తలు నిర్వహించిన సదస్సుపై దాడి, పార్లమెంటుపై జరిగిన దాడి కూడా ముఖ్యమైనవిగా చెప్పాలి.

2008లో ముంబాయిలో తాజ్ హోటల్‌పై జరిగిన దాడి తరువాత ఉగ్రవాద కార్యకలాపాల ఏరివేతకు, ఈ కేసుల దర్యాప్తుకు కేంద్రం ప్రత్యేకంగా జాతీయ దర్యాప్తు సంస్థ (నియా)ను ఏర్పాటు చేసింది. 'నియా' ఏర్పాటు తరువాత దేశ వ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలు చాలా వరకు తగ్గాయని చెప్పాలి. ఇదే సమయంలో అనేక మంది ఉగ్రవాదులు పట్టుబడ్డారు. అయితే 'నియా' ఏర్పాటు తరువాత ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గినా దేశ వ్యాప్తంగా అనేక నగరాలలో ఉగ్రవాద మూలాలు తరచూ వెలుగు చూస్తుండడం గమనార్హం. ఈ క్రమంలోనే మధ్య ఆసియా దేశాలతో పాటు పలు యూరప్ దేశాలను వణికిస్తున్న ఇస్లామిక్ స్టేట్స్ భారత్‌లో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేయసాగింది. అయితే నిఘా వర్గాల నిరంతర కృషి వల్ల ఐసిస్ ఆటలు ఇంత వరకు సాగలేదని చెప్పాలి. అయితే ఉగ్రమూకలు మరింత వేళ్లూనుకోక ముందే నాశనం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇందుకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలను, నిఘా వర్గాలను బలోపేతం చేయాల్సిన అవసరం వుంది. అప్పుడే ఉగ్రవాదంపై భారత్ పూర్తిగా పైచేయి సాధించగలుగుతుంది. ■

మానవాళిని మట్టుబెట్టే ఉగ్రవాదం

ఉగ్రవాద ఫలితాలు భయానకాలు. అసంఖ్యాక అమాయక ప్రజ ప్రాణాలు కోల్పోవటం వెంటనే కనిపించే దృశ్యం. మరెంతో మంది గాయపడటం, వికలాంగులవటం, మానసిక అనారోగ్యానికి గురి కావటం జరుగుతుంది. పరోక్షంగా ఉగ్రవాదకారణంగా హతమైన వారి కుటుంబాలు కష్టాలకు, కన్నీళ్లకు లోనవుతాయి. ఎంతోమంది తామున్న తావులు విడిచి, నివాసాల మాట మరచి, కట్టుబట్టలతో, చిన్నారులతో అనాథల్లా కొత్త తావులు వెతుక్కుంటూ వెళ్లే పరిస్థితి. వారికి సుఖసంతోషాలు మృగ్యం. వారి పిల్లలకు చదువులు, ఆట పాటలు అసలే దూరం. అగమ్య ప్రయాణం. బతుకు క్షణ క్షణ గండం.

ఉగ్రవాద దాడుల కారణంగా జరిగే నష్టాలను పూడ్చాలంటే, తిరిగి యథాతథ పరిస్థితులను నెలకొల్పాలంటే ప్రభుత్వానికి ఎంతో వ్యయప్రయాసలు. ఇటువంటి వాటి వల్లే అభివృద్ధిలో ఒకడుగు ముందుకు పడితే రెండడుగులు మళ్లీ వెనక్కు పడటం జరిగేది. బాధితులను అన్నివిధాల ఆదుకోవటం తక్షణ బాధ్యత అయితే, దీర్ఘకాల వ్యవధిలో ఏర్పడే దుష్ప్రభావాలను ఎదుర్కోవడం మరో ఎత్తవుతుంది. ఫైనాన్షియల్ మార్కెట్లలో పరిస్థితి తారుమారవుతుంది. అన్నిటికీ మించి భద్రతకు అత్యంత ప్రాధాన్య మివ్వవలసిన నేపథ్యంలో దానికి అత్యధిక మొత్తంలో ధన వ్యయం చేయక తప్పదు. రక్షణ వ్యయం పెరిగిపోతుంది. భూ, జల, ఆకాశ మార్గాలన్నిటా సరిహద్దు భద్రతను పెంచటంకోసం ఎంతో వ్యయం చేయాల్సి ఉంటుంది. మిలటరీ, పోలీసు బలగాలను పెంచవలసి ఉంటుంది. ఇంటెలిజెన్స్, నిఘా బృందాలు, వివిధ ఏజెన్సీలు ఎన్నెన్నో నిరంతరం ఉగ్రవాదసంస్థల కదలికలపై ప్రతిక్షణం దృష్టి నిలిపి ఉంచే పరిస్థితి ఉంటుంది.

ఏదేశానికైనా ఆదాయం ఇచ్చే రంగాల్లో టూరిజం ఒకటన్నది తెలిసిందే. ఉగ్రవాదుల దాడుల కారణంగా భయోత్పాత పరిస్థితులేర్పడి ఆయా దేశాల పర్యాటక రంగం తీవ్రంగా పతన మవుతుంది. ఆ రకంగా టెర్రరిజం, టూరిజాన్ని దెబ్బతీస్తుంది. ఉదాహరణకు ఫ్రాన్స్‌నే తీసుకుంటే టూరిజం వల్ల ఫ్రాన్స్‌కు సుమారుగా జిడిపి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్)లో 7-8శాతం ఆదాయం వస్తుంది. అయితే నైస్ అటాక్స్ తర్వాత ఫ్రాన్స్‌ను సందర్శించే పర్యాటకుల సంఖ్య సహజంగానే తగ్గింది. తద్వారా వచ్చే ఆదాయమూ తగ్గింది. స్థూలంగా చెప్పాలంటే టెర్రరిజం అంతర్జాతీయ వ్యాపారాన్ని దెబ్బ తీస్తుంది. అనిశ్చితి నెలకొన్న దేశాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గిపోతాయి.

ఉగ్రవాదం వల్ల జాతీయ వాదం బలపడి, విదేశాలను నిరంతరం సందేహించే పరిస్థితి నెలకొంటుంది. ఇది 2016లో యుఎస్, యూరప్‌లలో కనిపించింది కూడా. ఆయా దేశాలు వ్యాపారానికి, వలస ఉద్యోగులకు తలుపులు మూయటంతో ఆర్థిక సంబంధాలు సన్నగిల్లుతాయి. ఉత్పాదక వనరులను పరిమితం చేస్తాయి. ప్రపంచమంతా ఒక గూడుగా మారిపోయిందన్న భావన నెలకొన్న ప్రస్తుత కాలంలో దీనికి భిన్నంగా ఎవరికివారే యమునా తీరే భావన పెరిగి దేశాల మధ్య సత్సంబంధాలు కుంటుపడతాయి. సహకారం సన్నగిల్లుతుంది. ఈ రకంగా ఉగ్రవాదమనే విషబీజం చివరకు దుష్ప్రభావాల మర్రిచెట్టుకు దారితీస్తుంది. తనవేలితో తన కంటినే పొడుచుకునే ఈ దుస్థితినుంచి మనిషి బయటపడాలి. ఉగ్రవాదాన్ని అంతరింప జేయటానికి అంతా ఒక్కటై కృషిచేయాలి. తగలబడేది పక్కవాడి ఇల్లేకదా అనుకుంటే ఏదో ఒకరోజు అన్ని ఇళ్లదీ అదే పరిస్థితి అనే ఎరుకతో ప్రపంచదేశాలన్నీ వ్యవహరించి శాంతిస్థాపనకు పూనుకోవాలి. ■

కవితా...ఓ కవితా..!!

కవిత్వంలోంచి జీవజలం ప్రవహిస్తుంటే, అది హృదయ దాహాన్ని తీరుస్తుంది. మానవ జీవనసార రససిద్ధి అక్షరం అక్షరంలో ఆవిష్కృతం కావడంతో కవి జీవన లక్ష్యం నెరవేరడానికి మార్గం సుగమమౌతుంది. బాష, శైలి, శిల్పం, వస్తువు సమన్వయపరిచే పద్ధతి బహుముఖ కోణాల్ని ప్రతిబింబిస్తోంది. కవిత్వ నిర్మాణ రహస్యం తెలిసిన వాళ్లకి ఈ ఒడుపు కొత్తకాదు. ఆయా సందర్భాల్ని బట్టి, సంఘర్షణలను బట్టి, అనుభూతుల తీవ్రతలను బట్టి అంతరంగాలు కవితాత్మకంగా బహిర్గతమవుతాయి.

ప్రతి చిన్న విషయానికీ స్పందించే గుణం కవులు, రచయితలది. అందుకే ప్రకృతి వైపరీత్యాలపైనా వారు ఎంతో సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు.ఈ భూమికి జల ప్రళయాలు, భూకంపాలు, మంచు యుగాలు, అగ్నిపర్వతాల విస్ఫోటనం ద్వారా వచ్చే బడబానలం జీవసమూహాలను చంపే వ్యాధులు ఉపగ్రహాల తాకిళ్లు, యుద్ధాలు, విషవాయువులు, వరదలు, తుఫాన్లు ఇలా ఎన్నెన్నో సంభవించిన వైపరీత్యాలపై ప్రపంచ సాహితీవేత్తలు అనేకానేక రచనలు చేశారు, చేస్తున్నారు. వాటిని వర్తమాన యువకవులు నిశితంగా అధ్యయనం చేసి, రచనా వ్యాసంగం సాగిస్తే సమాజానికీ మేలు ఒనగూడుతుంది.

ఆధునిక కవిత్వం ఇలా కొత్త ఆలోచనల గొంతుకలను సృజనాత్మకంగా సవరించుకోవాలి. దీనికి జవజీవాలు అందించడంలో ఈతరం కవులు ముందువరుసలో ఉండాలి. వీరు చాలా శక్తివంతంగా, అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా అప్పుడు కళల గళాన్ని వినిపిస్తూ బతుకు సమస్యలను రక్తికట్టించగలరు. ఈ నేపథ్యం వెనుక ఆర్థిక మూలాలను, మూలకారణాలను సమాజంలో అన్వేషించి సామూహిక ప్రపంచానికి చేరువవ్వడానికి ప్రజలు, ప్రభుత్వం చేయూతనివ్వాలి.

కవిత్వంలో ఏదో ఒక సిద్ధాంతాన్ని చెప్పడానికో, బలపరచడానికో చేసే ప్రయత్నం కవితాశిల్పంలో ఒక ప్రధాన దోషం. సమాజంలో సంభవించే ఎన్నో అంతర్గత వైరుధ్యాల్ని నిస్వార్థంగా నిర్మలంగా, సచ్ఛీలంగా, సమర్థవంతంగా కవిత్వంలో ఆవిష్కరించాలి. విప్లవో ద్యమంలో ఆటుపోట్లు ఉన్నట్లే, విప్లవ సాహిత్య, సాంస్కృతిక ఉద్యమానికైనా ఇప్పుడు బలమైన కేంద్రం సాహిత్యమే.

కొందరు కవులు ఏ రచన చేసినా, ఎలాంటి రచన చదివినా, చివరికి ఏ సందర్భంలో ఏమాట మాట్లాడినా, ప్రతిపదంలో పలుకులో అంతస్సూత్రంగా పాశ్చాత్యుల సంస్కృతి, సామ్రాజ్యవాదాలను అవిశ్రాంతంగా ప్రస్తుతించడం జరుగుతుంది. వ్యాపార సంస్కృతి విశ్వ మంతా ఆకాశంలో విస్తరించాక ప్రతి విషయానికి ప్రచారం తప్పనిసరై పోతోంది. ఈ కొత్తపరిణామం సాహిత్యంలో కూడా చాలా విస్తృతంగా కనపడడం ఎప్పుడో ప్రారంభమైంది. అందువల్ల ఒక్కొక్కసారి మంచి రచనలు అటు పాఠకులని, ఇటు విమర్శకులని చేరలేకపోతున్నాయి.

సాహిత్యానికి రుజువర్తనాన్ని సరైన దృష్టిని సిద్ధాంతం ప్రసాదించాలి. అదే సిద్ధాంతాన్ని రాజకీయులూ నమ్మి రాజ్యాధికారం కోసం పోరాటాలు చేస్తుంటారు. సామాజిక జీవన స్వేచ్ఛాశీలతను కాపాడ టానికి రాజకీయ వర్గాలకు చైతన్యవంతమైన సూచనలు, విప్లవోద్యమ స్ఫూర్తిని సాహిత్యపరంగా అందించడంలో సాహితీవేత్తలు వెనుకంజ వేయకూడదు. సాహిత్య ప్రక్రియ ఏదైనాగానీ, అది చదివాక మానసిక స్థితిలో క్రమక్రమంగా మార్పు వచ్చి, ఒక కొత్తలోకం తెరుచుకోవాలి. మనకు తెలీని కొత్త అంశమేదో మనల్ని ఆలోచనలో పడవేయాలి. సంఘర్షణకి గురిచేయాలి. ఆ ఆలోచనా లోచనాల్లోంచి మనో ప్రపంచం మరింత విశాలం కావాలి. ఎన్నాళ్ల నుంచో వెతుకుతున్నదేదో దొరికినట్లుండాలి. వెళ్లవలసిన కొత్త కవితా లోకానికి దారి తెలిసి నట్లుండాలి. ఆ పదాల్లోంచి, వాక్యాల్లోంచి, జీవన కవితా మాధుర్యమేదో కదిలించాలి. కళ్లు చెమరించాలి.

ఆధునిక కవిత్వాన్ని పూర్తిగా అర్థంచేసుకోవడానికి ముందు కవిని, కవి పెరిగిన వాతావరణాన్ని అర్థంచేసుకో వడం చాలా అవసరం. ఎందుకంటే కవిత్వంలో కవి ఆలోచనాసరళి, మనోభావాలు, నమ్మకాలు, భయాలు..ఇలా అన్నీ కాకపోయినా కొన్ని మాత్రం బహిర్గతం అవుతాయి. కాగా, కొన్ని నిక్షిప్తమై నినాద దశనుంచి బయటపడటానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఒక దృశ్యం, ఒకరూపం, ఒక జీవితం, ఒక భావం, కవితా శక్తి కలిగిన రసజ్ఞునికి గోచరించినప్పుడు తనలో ఉండే కళాశక్తి పైకి ఒక స్వరూపంగా జనించాలని, ఆవేదన పొందడం చేతనే, కళా స్వరూపం ఉద్భవించటం, ఆ సృష్టి భాషా స్వరూపమైతే కవిత్వమూ, వర్ణ స్వరూపమై విరాజిల్లుతుంది.

మంచి కవిత్వం చదివితే ఒక గొప్ప ఫీల్ మనల్ని వెంటాడాలి. ఆ కవిత్వంలో కట్టిపడేసే అందమైన పొందిక ఉండాలి. గొప్ప సౌందర్యం ఉండాలి. ఒద్దికగా పదం వెనుక పదం, వాక్యం వెనుక వాక్యం అమరుతూ పోయి గొప్ప భావధారని ఎక్కడా తొణకకుండా ఎంతదాకా తీసుకెళ్లాలో అంతదాకే నడిపించాలి. ఏకాంతంగా లోలోపల చదువు కొని, కవి స్వప్నాన్ని పాఠకుడు తన స్వప్నంగా స్వీకరించడానికి దోహదపడుతుంది. ఒక్కో భావనని ఒక్కో పదచిత్రం ద్వారాను అరిగిపోయిన భావాన్ని అవతల పారేసిన కొత్త పదసృష్టి ద్వారాను అత్యంత సున్నితంగా ఈ కలల మార్పిడి జరుగుతుంది.

ముక్కలవుతున్న సమాజం, విచ్ఛిన్నమవుతున్న సాహిత్య సంబంధాల నలుగులాటలో ఒక్కొక్కరూ లేదా, చిన్న సమూహాలు తమకుతామే సారస్వత దీపాలవుతున్న దశ యిది. అందుబాటులో కొచ్చిన ప్రపంచ సాహిత్యం, ఇంటర్నెట్ సౌకర్యం, ఫేస్‌బుక్‌లు, కవుల సంఖ్య పెరగడం, సాహితీ వేదికల ప్రోత్సాహం కవితా పోటీలు, సంకలనాలకు అవార్డులు ప్రకటించడం, ఇలా అనేకానేక కారణాల నేపథ్యంలో కవిత్వం రాశి పెద్దదైపోయింది. వాసిగల మంచి కవిత్వాన్ని అపుడపుడూ వెతుక్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

కవితా నిబద్ధత అనేది చలన లేనిదికాదు. కాలాన్ని బట్టి, సామాజిక పరిణామాలను బట్టి, వ్యక్తిత్వాన్ని బట్టి, నిబద్ధత ఆధారపడి ఉంటుంది. ఏకసూత్రత ఉండదు. వీటిని గాలికి వదిలేసి రాజకీయ నిబద్ధతా స్పృహలో మాత్రమే అంచనావేయడం సహేతుకం మాత్రం కాదు.

వ్యక్తిత్వమూ, రచనా పరమార్థమూ ఒకే తాత్త్వికరేఖ మీద పయనించాయో ప్రశ్నించుకొని జవాబుకోసం నిరీక్షించనక్కరలేదో అటువంటి కవి- నేపథ్యం నుంచి కవిత్వాన్ని పరిశీలిస్తే ఆ కవి మనకు మరింత యిష్టుడవుతాడు. కవిత్వంలో కవితాభివ్యక్తే ఉంటుంది కానీ అభిప్రాయాలంటూ ఉండవు. అది కవిత్వం కాదు. పొడిపొడి మాటల ఆడంబరమంతా అయోమయమే.

కవి పని కవిత్వమే. కీర్తి, స్వార్థం, వ్యామోహాలకు అతీతంగా ఈపని చేసుకుంటూ పోతూ ఉంటే మెచ్చేవాళ్లు మెచ్చుకపోరు. గమనించేవారు గమనించకపోరు. నెత్తిన పెట్టుకునేవారు ఒకరోజు ముందూ వెనకలుగా పెట్టుకొని ఊరేగించకా మానరు.

-ఎస్.ఆర్.భల్లం

కృతి

తెలంగాణ కథాంతరంగం



తెలంగాణ కథాసాహిత్యానికి శతాధిక సంవత్సరాల చరిత్ర ఉంది. బండారు అచ్చమాంబను ఆద్యురాలిగా పేర్కొన్నా, ఈ నేలమీద మొట్టమొదటి కథ రాసింది మాత్రం మాడపాటి హనుమంతరావు గారని ప్రతీతి. పాత తరం, తర్వాతి తరం, నేటితరం కథకులు సృజించిన 20 కథలపై ప్రముఖ కవి, విమర్శకుడు గోపగాని రవీందర్ వెలువరించిన విశ్లేషణా వ్యాసాల పొత్తం 'తెలంగాణ కథకుల కథాంతరంగం'. వట్టికోట ఆళ్వారు స్వామి, బి.ఎస్.రాములు, బి.మురళీధర్, దాశరథి రంగాచార్య, కాలువ మల్లయ్య వంటి మూడుతరాలకు చెందిన 20 కథకుల రచనలపై చక్కటి విశ్లేషణను అందించారు. మచ్చుకి ఒక్కో రచయితదీ ఒక్కొక్క కథే ప్రస్తావించినా ఆయా రచయితల సామాజిక దృక్పథాన్ని, వారి సాహిత్య ప్రయోజనాన్ని ఒడిసి పట్టుకునే ప్రయత్నం చేశాయి ఈ వ్యాసాలు. తెలంగాణ బతుకు చిత్రం, ఆత్మ గౌరవం, విశ్వాసం, పోరాట వారసత్వం, ప్రాంతీయవాద అస్తిత్వ ఉద్యమం, ఆదివాసుల గోడు, రైతుల వెతలు, పల్లెలపై గ్లోబలైజేషన్ ప్రభావం, బడుగు ప్రజల ఆలోచనలు..సర్దుబాటులు, బాల్య సంతోష విషాదాలు, ఛిద్రమవుతున్న కులవృత్తులు, ఇలా అనేకానేక కథాంశాలపై వీక్షణం గావించారు రచయిత. తెలంగాణ కథా సాహిత్యంపై వెలువడిన మంచిగ్రంథాల జాబితాలో యిదొకటి.

(తెలంగాణ కథకుల కథా తరంగం:గోపగాని రవీందర్; వెల: రూ.100; ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు)

-రమణ వెలమకన్ని

ఆకట్టుకునే అసామాన్య కథనరీతి

ఆరు దశాబ్దాలక్రితం గోవులా తమ కుటుంబ సేవలకే అంకితమై, అన్యాయానికి గురయినా, నోరు మెదపని ఓ సాధ్వి కథను 'ఒక ఇల్లాలి కథ' పేరిట జి.ఎస్.లక్ష్మి నవలగా అందించారు. దేశానికి స్వరాజ్యం వచ్చిన కొత్తల్లో పుట్టిన స్వరాజ్యం ఒక సగటు తెలుగు ఆడపడుచు. ఈడేరకముందే రమణమూర్తితో పెళ్లయి, పుట్టింటివారి గడప తొక్కకూడదన్న ఆంక్షను అక్షరాలా పాటిస్తూ అత్తవారింటికే అంకితమవుతుంది. భర్త చండశాసనుడు, అత్త, మరిది, ఆడపడుచులు ఏ ఎండకాగొడుగు పట్టే రకం. తల్లి గుండె సమస్యతో ఆసుపత్రిపాలైతే చూడటానికి వెళ్లాలనుకుని కేంపులో ఉన్న భర్తతో మాట్లాడలేక, అత్తగారి అనుమతితో వెళుతుంది. ఆ తర్వాత భర్త ఆగ్రహించి ఇంట్లోకి రానీయడు. రోజంతా వీధిలోనే గడపముందు గడిపి చివరికి పుట్టింటికే వెళ్లి తన జీవితానికో ఆధారం కల్పించుకుంటుంది. శేష జీవితాన్ని అనాధాశ్రమానికి వినియోగించాలని నిశ్చయించుకుంటుంది. తమ్ముడూ, చెల్లెలు ఆస్తి దక్కించుకుని రమణమూర్తిని ఒంటరివాడిని చేస్తారు. తన తప్పు తెలుసుకున్న రమణమూర్తి స్వరాజ్యాన్ని తిరిగి తన జీవితంలోకి ఆహ్వానిస్తాడు. స్వరాజ్యం తిరస్కరిస్తుంది. నవలలో సన్నివేశ చిత్రీకరణ, శిల్పం అద్భుతంగా ఉంది. ఇల్లాలికి కూడా ఓ వ్యక్తిత్వం ఉంటుందని, దాన్ని గౌరవించకపోతే కుటుంబమే నష్టపోతుందని చెపుతుందీ నవల.

(ఒక ఇల్లాలి కథ -నవల: జి.ఎస్. లక్ష్మి; వెల: రూ.150; ప్రతులకు: ప్రధాన పుస్తక విక్రయ కేంద్రాలు)

-కూర చిదంబరం

బాలలకు బహుమానం

వెన్నముద్దలు! మృదుత్వం, చల్లదనం వెన్నముద్ద లక్షణాలు. డా.పత్తిపాక మోహన్ 'వెన్న ముద్దలు' పేరిట అందించిన బాల గేయాల్లో ఈ లక్షణాలు 'అక్షరాలా' ఉన్నాయి. తొలి గేయం 'అమ్మ మనసు..'లో జీవితానికి ముఖ్యులైన తల్లితండ్రులను, గురువు, మిత్రులను పేర్కొనడం ఎంతో బాగుంది. గేయాల్లో పూల పరిచయం, కాలాల పరిచయం, వర్షాలు, మొక్కలు, రైలుబండి, గాలిపటం, పుస్తకం, మన జండా, నా దేశం ..ఇలా పిల్లలకు కావలసిన ప్రాథమిక విజ్ఞానాన్నంతా అచ్చతెనుగు పదాలతో అందించారు.

(వెన్నముద్దలు-బాలగేయాలు:డా.పత్తిపాక మోహన్; వెల:రూ.60; ప్రతులకు అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు)

నాన్నకు అక్షరార్చన

'నాన్న'పై కవితలు ఎన్నో వచ్చి ఉండవచ్చు. అయితే ఎస్. సుమిత్రాదేవి 'నాన్న కావాలి' పేరిట దీర్ఘకవితలో నాన్నను సమగ్రంగా దర్శింపజేశారు. నాన్న శబ్దంవిని, ఎదురేగి/ పరుగెత్తే పసిపాదాలు/ భుజకీర్తిగా వాలిన/ చిట్టిపావురం..బిడ్డ, నాన్న పట్ల చూపే ప్రేమకు ఇది అక్షరదృశ్యమే. 'బాల్యంపేజీ తెరవగానే/ నాన్న రూపం మెరుస్తుంది..ప్రతి నిత్యం తట్టి లేపే/ ప్రబోధ గీతమౌతుంది' అంటారు. అనేకానేక వృత్తుల్లో ఉండి, బిడ్డలకోసం శ్రమించే నాన్నలను వాస్తవికంగా చిత్రించారు. చివర్లో ..నీ తండ్రికి/ నీ హృదయంలోనేకాదు, నీ ఇంట్లోనూ చోటివ్వు..అంటారు.

(నాన్న కావాలి-దీర్ఘకవిత: ఎస్.సుమిత్రాదేవి; వెల: రూ. 50; ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు)

-ప్రభాస

ఆలోచింపజేసే విశ్లేషణ..

దళితుల చరిత్ర పేరిట డా.కత్తి పద్మారావు లోగడ 4 పుస్తకాలు వెలువరించారు. ఇప్పుడు 'దళితుల చరిత్ర' 5వ భాగాన్ని అందించారు. ఇందులో దాదాపు 12 అధ్యాయాలున్నాయి. సింధూ నాగరికత నిర్మాతలు దళితులే!, సింధూ నాగరికతలోని వ్యవసాయ సంస్కృతి; చార్వాకుల నుంచి రాబర్ట్ ఇంగర్సాల్ (దేవుళ్ల పుస్తక రచయిత) వరకు అంటే సుమారు క్రీ.పూ.7వ శతాబ్ది నుండి క్రీ.శ.11వ శతాబ్ది వరకు ఒకేరకమైన తర్కంతో భౌతికవాదులు అణగ దొక్కబడిన జాతుల వైపు మాట్లాడుతున్నారు. పరశురాముని పితృస్వామ్య సంస్కృతి, బ్రాహ్మణుల శ్రమరహిత భావన, దానవులంటే ఇక్కడి మూల వాసులే ఆర్యరాజులకు తొత్తుగా.., కృష్ణ పాత్ర, కృష్ణుని స్వభావ చిత్రణ పై అంబేద్కర్, చారిత్రక నిర్మాణంలో ఆయుధాల పాత్ర, దేశీయ తెగలపై దాడిచేసిన హిందూ దేవుళ్ల మొదలైన అధ్యాయాలున్నాయి. అస్పృశ్యుల కోసం పోరాడిన అంబేద్కర్‌ను, శూద్రులకోసం పోరాడిన పూలేను జాతీయ చరిత్ర కారులు ఫోకస్ చేయలేదంటారు. ఆది హిందువులను, ఆది ఆంధ్రులను జయించిన ఆర్యులు వారిని బానిసలుగా మార్చా రంటారు. అస్పృశ్యులు బౌద్ధం ఎందుకు తీసుకున్నారు?, దళితుల పునరుజ్జీవనశక్తి అంబేద్కర్, ఆర్యులకు ముందే దళిత రాజ్యాలు, అస్పృశ్యభావనపై యుద్ధమే చరిత్ర..ఇలా పలు చారిత్రక, సామాజి కాంశాలతో కూడిన ఈ పుస్తకం చరిత్ర అధ్యయనవాదులకు కరదీపికగా తోడ్పడుతుంది.

(దళితుల చరిత్ర -ఐదవభాగం;డా.కత్తి పద్మారావు; వెల: రూ.250; ప్రతులకు: అన్ని పుస్తకాల షాపులు)

-తంగిరాల చక్రవర్తి

జ్ఞానదేవుడి విశ్వప్రేమ

కస్తూరి మురళీకృష్ణ

'అజీ సోనియాచ దిను, వర్షే అమృతా చ ఘను'

హరి పాహిలారే హరి పాహిలారే... ఒక్కసారిగా అందరి హృదయ స్పందనలు స్తంభించిపోయాయి.. క్షణకాలం మాత్రమే. అతని స్వరం నుంచి వెలువడుతున్న శబ్దతరంగాలు అమృత బిందువుల్లై, వారి హృదయలోలోతుల్లో ఘనీభవించి ఉన్న దుఃఖం కరగి ఆవిరైపోయేట్టు చేస్తూ, వారికి బ్రహ్మానందాన్ని అనుభవానికి తెస్తున్నాయి.

'ఇది అత్యద్భుతమైన రోజు. మేఘాలు అమృతాన్ని వర్షించే రోజు' అమృతం మనుషులను చిరంజీవులను చేస్తుంది. మృత్యువును దరి రానీయదు. అమృతం సేవించిన దేవతలు అమరులయ్యారు.దేవతలను ధ్యానించిన మనిషి అమృత సేవనంతో అమరుడవుతాడు. అక్కడున్న వారంతా తమ దుఃఖాన్ని మరచిపోయారు. ఇక తమకు జ్ఞానదేవుడి భౌతిక శరీరం కనబడదన్న వేదనను మరచిపోయారు. కేవలం ఇరవై యేళ్ల వయసులోనే జ్ఞానదేవుడు సమాధిస్థితికి స్వచ్ఛందంగా చేరుకుని 'చిరంజీవి'లా నిలుస్తాడన్న ఆలోచనను మరచిపోయారు. అనంతమైన ఆత్మ నశ్వర శరీరాల్లో ఒదగటం వల్ల కలుగుతున్న అశాంతిని మరచిపో యారు. వారంతా ప్రేమ గంగా ప్రవాహంలోని నీటి బిందువులయి పోయారు. విశ్వం సర్వం వ్యాపించి ఉన్న విశ్వాత్మలో తాము భాగం అన్న భావనతో అత్యంత చైతన్యవంతమైన బ్రహ్మానందానుభూతి పరవశులయ్యారు.

బరవా సంత్ సమాగము

ప్రగటవా ఆత్మారాము...సాధు సంతులతోని సాన్నిహిత్యం ఆత్మ సాక్షాత్కారానికి దారితీస్తుంది.

హరి పాహిలారే, హరి పాహిలారే.. హరి నామస్మరణ పారవశ్యం తో హరిదర్శన భాగ్యంతో తరించిపోసాగారు అక్కడి ప్రజలు.

తమ నడుమ ఉన్న జాతి, కుల, ప్రాంత, ధర్మ భేదాలను సంకుచితాలను మరచి,, అందరూ ఒకటై, జగతిలోని కణకణంలో దివ్యత్వంతో కూడిన అమరమైన ఆత్మ ఒక్కటే ఉందని గ్రహించి ప్రేమగంగా ప్రవాహంలో తన్మయులవుతున్నవారిని చూసిన జ్ఞానదేవుడి పెదవులపై చిరునవ్వు మెరుపులా మెరసింది.

తన గుహలోకి వెళ్లేముందు ఒక్కసారి అందరినీ కలయచూశాడతడు.

****

'తాకకు..దూరం..దూరం'

'ఈ పీడ మనకెందుకు దాపురించిందో! ఎప్పుడు వదలుతుందో ఈ పీడ?'

'తెల్లారగానే జోలెతో సిద్ధం. సూర్యుడు రావటం ఆలస్యమౌతుం దేమో కానీ వీడి పొట్ట పూజకు ఆలస్యం కాకూడదు'.

బాల జ్ఞానదేవుడికి రోజూ ఎదురయ్యే ఛీత్కరింపులు, చీదరింపులే అయినా ప్రతిరోజూ ఇది ఆశ్చర్యంగానే ఉంటుంది. మనుషులు ఎందు కింత క్రూరంగా ఉంటారు? వీళ్లలోని ఏ లక్షణం మనిషిని సాటి మనిషిని చూసి జాలిపడలేని అభిన్నమైన స్థితికి దిగజారుస్తుంది?

తనని చూసి తలుపులు వేసుకుంటున్న వారిని, తనని తాకితే ఏదో పాపం అంటుకుంటుందన్నట్టు దూరం పారిపోయేవారినీ, పశువులను ప్రేమగాచూస్తూ, మనుషులను చీదరించుకునేవారినీ చూస్తున్న జ్ఞాన దేవుడి అంతరంగంలో పలురకాల ఆలోచనలు పరవళ్లుతొక్కుతున్నాయి.

'మనుషులు భగవదంశతో జన్మించినా, వారు తమలోని దివ్యత్వా న్ని గుర్తించకుండా మూర్ఖత్వం, బిలంలోకి వెలుతురు రాకుండా బండ రాయి అడ్డున్నట్టు అడ్డుపడుతుంది. అందువల్ల వారు మనుషులయి కూడా పశువుల్లా ప్రవర్తిస్తారు. మానవ సహజ లక్షణం ప్రేమ. కానీ ఆ ప్రేమను స్వార్థం, లోభం, మద మాత్సర్యాలు కప్పి ఉంచుతాయి. అద్దంపై ఉన్న దుమ్ము ధూళిని తొలగిస్తే ఎలాగయితే ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తుందో, అలాగే మనసుపైని మలినాలను తొలగిస్తే వ్యక్తులకు తమ దివ్యత్వం గ్రహింపుకు వస్తుంది'. అన్నయ్య నివృత్తి నాథుడి మాటలు జ్ఞానదేవుడిలో ఆలోచనలు కలిగిస్తున్నాయి.

'ఎందుకని అద్దంపై మలినాలు చేరతాయి? వాటిని ఎలా తొలగించటం?' అన్నయ్యని ప్రశ్నించాడు జ్ఞానదేవుడు.

'అజ్ఞానం వల్ల. ఈ దేహం నేను, ఈ ఆస్తులు నావి, ఈ బంధాలు, అనుబంధాలే ప్రపంచం అన్న మూర్ఖత్వం వల్ల'.

'మరి మనల్ని వెలివేయటం, మనల్ని ఊళ్లోకి రానీయకపోవటం, భిక్ష నిరాకరించటం కూడా ఈ అజ్ఞానం వల్లనేనా?'

'నిస్సందేహంగా, సరైనరీతిలో శాస్త్రాధ్యయనం చేయకపోవటం వల్ల శాస్త్రాలను అపార్థం చేసుకోవటం వల్ల. శాస్త్ర విషయాలు అందరికీ అందుబాటులో లేకపోవటం వల్ల' అన్నయ్య మాటలు జ్ఞానదేవుడిని ఆలోచనల్లోకి నెట్టాయి.

****

తనను చూడగానే చీదరించుకునే వారిని గమనించటం ఆరంభిం చాడు జ్ఞానదేవుడు. వారిలో తనపట్ల ద్వేషం, అసహ్యం కనిపిస్తోంది. కానీ ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు కూడా కనిపిస్తున్నాయి. అంటే, వ్యక్తిలో ప్రేమభాండం స్వతహాగా ఉంది. కానీ దాన్ని తనకు, తనదైన దానికి పరిమితం చేసి, ఆ భాండాగారంలోని అధికశాతం ప్రేమను వ్యర్థంచేస్తున్నాడు. జ్ఞానదేవుడికి విశ్వాసం కలిగింది. ఇంతకాలం ఆ పసిమనసుకి మనుషులలో ద్వేషం తప్ప మరేమీ లేదన్న భావన ఉండేది. కానీ అన్నయ్య మాటల ప్రభావంతో అతని దృష్టి మారింది. ఇప్పుడు ప్రతి ఒక్క ప్రాణిలో పొంగిపొర్లుతున్న ప్రేమప్రవాహం కనిపిస్తోంది. ఆ ప్రేమ ప్రవాహాన్ని అడ్డుకుంటున్న స్వార్థం, క్రోధం, ద్వేషం, భయం వంటి సంకుచితాలు కనిపిస్తున్నాయి.

****

'మా తండ్రి విఠల్‌పంత్ గారు మీకు తెలుసు. ఆయన సన్యాసం స్వీకరించి, గురువుగారి ఆదేశానుసారం తిరిగి సంసారంలో ప్రవేశించా రని మీరంతా మమ్మల్ని వెలివేశారు. తానుచేసిన పాపప్రాయశ్చిత్తార్థం మా తల్లీ తండ్రి ప్రాణత్యాగం చేశారు. ఇంకా మమ్మల్ని వెలివేసిన వారిగానే చూడటం అన్యాయం. మాకు ఉపనయనం చేసి విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించే వీలు కల్పించండి' నివృత్తినాథుడు 'ఆలండి' పెద్దలను అభ్యర్థించాడు.

వాళ్లల్లో వాళ్లుచర్చించుకున్నారు. తర్జన భర్జనలు పడ్డారు. శాస్త్రాలను మధించి చివరికి తీర్పు చెప్పారు. 'మీలాంటి వారి గురించి శాస్త్రాలు ఏమీ చెప్పలేదు. మీ తండ్రి బ్రాహ్మణుడయి, అతడు సన్యాసం స్వీకరించటంతో కులంపోయింది. మళ్లీ వచ్చి సంసారం చేయటం వల్ల కలిగిన పిల్లల కులం ఏమిటన్నది శాస్త్రాలలో లేదు. మీరు బ్రాహ్మణులు అవునో, కాదో తీర్పు చెప్పే విజ్ఞానం మాకులేదు. మీరు ప్రతిష్ఠానపురం వెళ్లండి. అక్కడి పెద్దలు తేలుస్తారు'.

పెద్దలమాటలు విని నిరాశచెందారు. నివృత్తినాథుడు, జ్ఞాన దేవుడు సోపన్, ముక్తాబాయిలు. కానీ ప్రతిష్ఠానపురం వెళ్లాలని నిశ్చయించుకున్నారు.

****

'శాస్త్రాలలో మిమ్మల్ని బ్రాహ్మణులుగా నిర్ణయించేందుకు ఆధారాలు

ఏమీలేవు. శాస్త్రంలో లేని విషయాలను గురించి నిర్ణయం తీసుకునే పాండిత్యం మాలో ఎవరికీ లేదు'నిర్ద్వందంగా ముక్తకంఠంతో తీర్మానిం చారు ప్రతిష్ఠానపురం పెద్దలు. అంతవరకూ వారి వాదనలను మౌనంగా వింటున్న జ్ఞానదేవుడు ముందుకు వచ్చాడు.

'బ్రాహ్మణుడంటే ఎవరు? జన్మచేత బ్రాహ్మణుడా? బ్రహ్మజ్ఞానం కలిగి ఉండినవాడు బ్రాహ్మణుడా?'

అందరూ ఆశ్చర్యంగా ఆ పిల్లవాడివైపు చూశారు.

'బ్రహ్మజ్ఞానం అంటే ఏమిటో తెలుసా?' వ్యంగ్యంగా అడిగారు.

జ్ఞానదేవుడు అందరివైపు చూశాడు. 'ప్రతి వ్యక్తిలో, ప్రతి ప్రాణిలో, ప్రతి కణకణంలో విశ్వాత్మను దర్శించగలవాడే బ్రాహ్మణుడు'

'అబ్బో పిల్లవాడివి పెద్ద మాటలు మాట్లాడుతున్నావు. నీయందు బ్రహ్మజ్ఞానం ఉంటే ఈ ఎద్దు కూడా వేదం వల్లెవేస్తుందా?' కోపంగా అడిగారు.

'నాకీ ప్రపంచం అణువణువునా విశ్వాత్మ స్పష్టంగా ద్యోతకమవు తోంది. మీలో, నాలో, ఈ ఎద్దులోనే కాదు, సకల ప్రాణుల్లో దివ్య ప్రేమ పరవళ్లు తొక్కుతోంది'.

జ్ఞానదేవుడి మాట పూర్తికాకముందే ఎద్దు వేదం వల్లించసాగింది.

****

అరే అరే జ్ఞానఝులాసి పావన్!

తుఝే తుజ్ ధ్యాన్ కరో ఆవే!!

తుఝూ తూంచిదేవ తుఝూ భావ!

ఫిటలా సందేహా అన్యతత్వీ!! పాడసాగాడు నివృత్తిదేవుడు

జ్ఞానదేవా, నువ్వు పరమపవిత్రుడివి. నీకు ఆత్మజ్ఞానం లభించింది. ఆత్మను అర్థంచేసుకోవటం ద్వారా నువ్వు పరమాత్మలో భాగమన్న జ్ఞానం నీకు కలిగింది. నీకూ, దైవానికి నడుమ ఉన్న భేదభావాలు, సందేహాలు అదృశ్యమయ్యాయి'.

గురువు, అన్నయ్య అయిన నివృత్తినాథుడికి నమస్కరించాడు జ్ఞాన దేవుడు. 'నాకు ప్రపంచమంతా ప్రేమసాగరంలా కనిపిస్తోంది. ఆ సాగరంలోని నీటిబిందువులే మానవులు. తరచిచూస్తే ఏ నీటి బిందువు అస్థిత్వం దానిదే. కానీ మొత్తం సాగరంలో అన్నీ కలిసి అస్తిత్వాన్ని కోల్పోతాయి. ఈ ప్రపంచం కూడా అంతే. ఏ వ్యక్తికి ఆ వ్యక్తి తాను ప్రత్యేకం అనుకుంటాడు. కానీ విశ్వప్రేమ సాగరంలో అంతా ఒకటే. ఎవరికీ ప్రత్యేక అస్తిత్వం లేదు. అంతా ప్రేమ ప్రవాహంలో భాగమే'.

'జ్ఞానదేవా నీ జ్ఞానం సంపూర్ణమయింది. నీ జీవిత లక్ష్యం నిశ్చయించుకున్నావా?' అడిగాడు నివృత్తినాథుడు.

'ఆ..నా జీవిత లక్ష్యం, కృపాసింధు, కరుణాకరుడు, పరమదయా ళువు అయిన హరి నిర్ణయించాడు. పాండిత్యం తప్ప పరిజ్ఞానం, విద్య తప్ప విజ్ఞానం లేక అనంతం, ఆద్యంతాలు లేని భారతీయ ధర్మాన్ని పదాలకు పరిమితం చేస్తూ కర్మకాండలే మోక్షానికి మార్గం అని గుడ్డి వాడికి గుడ్డివాడు దారి చూపిస్తున్న రీతిలో సమాజం సాగుతోంది. ఈ ప్రజలకు శాస్త్రవిజ్ఞానాన్ని, తత్త్వాన్ని చేరువచేస్తాను. అసలు భారతీయ విజ్ఞానాన్ని బోధిస్తాను. కులమతజాతి ధర్మ విద్వేషాలతో ప్రజ్వరిల్లు తున్న భారతీయ సమాజానికి ప్రేమామృత వర్షధారలను అందిస్తాను. ప్రతి వ్యక్తిలో భగవంతుడున్నాడన్న సత్యం గ్రహించేట్టు చేస్తాను. భగవద్గీత జ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సామాన్య ప్రజల భాషలో అందిస్తాను' చెప్పాడు జ్ఞానదేవుడు. ఆశీర్వదించాడు నివృత్తినాథుడు.

****

రంగయే ఈ ఓ రంగయే ఈ వో!

విఠా ఈ విఠా ఈ మాఝే కృష్ణాఈ కాన్హా ఈ!!

విఠలా, నా గానమాధుర్యానికి పరవశించి రావా! నువ్వే నా తల్లితండ్రి! విఠాయి, విఠాయి, కృష్ణాయి, కాన్హాయి! ఎన్ని విభిన్న మైన నామాలతో కీర్తిస్తే నువ్వు కరుణిస్తావు?

సామాన్య ప్రజలకు అర్థమయ్యే మరాఠీ భాషలో 'అభంగ్'లనే కీర్తన లను రచించటం ప్రారంభించాడు జ్ఞానదేవుడు. 'ముక్తికోసం యజ్ఞ యాగాదులు చేయనవసరంలేదు. మంత్రాలను వల్లెవేయనవసరంలేదు. భగవన్నామస్మరణమే ముక్తిజ్ఞానం. సర్వవిజ్ఞాన సర్వస్వం. ఈ నామ ధ్యానానికి కులం లేదు, మతంలేదు. కట్టుబాట్లు లేవు. ప్రతిప్రాణి శ్వాస పలికేది ఈ నామమే' జ్ఞానదేవుడి బోధనలు మహారాష్ట్ర ప్రజలను ఉర్రూతలూగించసాగాయి. సరళం, సుందరమైన మరాఠీ భాషలో అత్యంత సంక్లిష్టము, సామాన్య ప్రజల అవగాహన దూరము అయిన భారతీయ ధర్మంలోని అనేక సత్యాలను ప్రకటిస్తూ సత్యాలను ప్రజలకు చేరువ చేశాడు జ్ఞానదేవుడు. ప్రజల నడుమ ఉన్న భేదభావాలు, అబద్ధపు ధర్మ సూత్రాల ప్రచారాలను తొలగించి నిజమైన అసలైన భారతీయ ధర్మ సూత్రాలను బోధించసాగాడు.

మోగరా ఫులలా, మోగరా ఫులలా

ఫూలె వేచితా బహరూ కాళియాసి ఆలా

మల్లెపూవు వికసిస్తోంది. మొగ్గలు పూలవుతున్నాయి. అత్యంత సుందరము, తరళము అయిన అభంగ్‌ల గానానికి ప్రజలు పరవశులవు తున్నారు. మల్లె మొక్కను మానవుడి మెదడులోని మాయకు ప్రతీకగా చేసి ఆ పూలమాలను భగవంతుడి పాదాలకు అర్పించడం అంటే, ఆ మాయను తొలగించుకుని భగవంతుడి అసలు స్వరూపాన్ని దర్శించట మన్నరీతిలో జ్ఞానదేవుడు సృజించిన 'అభంగ్' మహారాష్ట్ర ప్రజలకే కాదు దేశ ప్రజలందరిలోని ధార్మికతకు ఊపిరిపోసింది. 'అభంగ్'లు గానం చేస్తూ, భారతీయ తాత్విక చింతనను, పారమార్థిక సత్యాలను సామాన్యులకు చేరువచేస్తూ జ్ఞానదేవుడు దేశసంచారం చేశాడు. తురుష్కుల దాడులకు అల్లకల్లోలమవుతూ, దిక్కుతోచని స్థితిలో ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతున్న భారతజాతి ఆత్మగౌరవాన్ని చిగురింపజేస్తూ, ఆధ్యాత్మిక జ్యోతులను వెలిగించాడు. కులభావనలతో సంకుచితమౌ తున్న భారతీయ సమాజంలో ప్రేమభావనల జ్యోతులు వెలిగించాడు. అందరిలో ఒకే భగవదంశ ఉన్నప్పుడు హెచ్చుతగ్గులు, భేదభావాల ప్రసక్తిలేదని, అలాంటి భావనలు ఎవరికైనా ఉంటే అది వారి అజ్ఞానం వల్లనే అని బోధిస్తూ సామాజిక అడ్డుగోడలను కూల్చివేశాడు. భగవద్గీతపై వ్యాఖ్యానం 'జ్ఞానేశ్వరి' మరాఠీ భాషలో రచించి భగవద్గీత విజ్ఞానాన్ని ప్రజలకు చేరువచేశాడు. అల్లకల్లోల మౌతున్న భారతీయ సమాజాన్ని విజ్ఞాన భావనలతో ప్రేమభావనతో ఏకం చేశాడు. తన 21వ యేట, భగవద్గీత వ్యాఖ్యానం పూర్తయిన తరువాత 'సంజీవన్ సమాధి' స్థితి గ్రహించాలని నిశ్చయించాడు.

****

'భారతీయ ధర్మం గంగానదిలాంటిది. పరమ పవిత్రమైనది. ఎలా గంగానది తనని తాను స్వయంగా శుభ్రపరచుకొనే లక్షణం కలదో అలాగే భారతీయ ధర్మం తననితాను శుభ్రపరచుకునే లక్షణం కలిగి ఉన్నది. ఈ ధర్మంలో చేరిన మలినాలను తొలగించేందుకు బయటి నుంచి ఎవరో రావాల్సిన అవసరంలేదు. ఈ సమాజంలోంచే సంస్కర్తలు ఉద్భవిస్తారు. భారతీయ ధర్మాన్ని పవిత్రగంగలా ప్రవహిం ప జేస్తారు. స్వధర్మంలో మరణించినా శ్రేయస్కరం. భయావహమైన పరధర్మాన్ని త్యజించి స్వధర్మాన్ని స్వీకరించటం. ప్రేమ ప్రవాహంతో ప్రపంచాన్ని పులకరింపచేయండి'. సజల నయనాలతో తనని చూస్తున్న ప్రజలకు చివరి సందేశం వినిపించాడు జ్ఞానదేవుడు. చేతులు జోడించి నమస్కరించాడు. సంజీవన సమాధి కోసం ఏర్పాటుచేసిన గుహలోకి భగవన్నామస్మరణచేస్తూ ప్రవేశించాడు.

వర్షత్ సకళమంగళీ! ఈశ్వరుష్మాంచీ మాందియాళీ!

అనవరత భూమండళీ! భేటతు భూతాం

ప్రజలకు దీవెనలు, సుఖసంతోషాలను అందిస్తూ అవసరమైనపు డల్లా సాధువులు, సంతులు జన్మిస్తూంటారు. ప్రజలకు జ్ఞానబోధ చేస్తూ దిశానిర్దేశనం చేస్తూంటారు. ప్రజలు అలాంటి వారి సన్నిధిలో తమ జన్మను సఫలంచేసుకోవాలి. తమలోని దివ్యాత్మను గుర్తించాలి. వీరు కల్పతరువుల్లాంటివారు వారి ప్రవచనాలు అమృత సదృశాలు వారి సాంగత్యంలో ప్రజలు సుఖశాంతులతో నిత్యం విలసిల్లాలి.

****

అలాండిలోని సిద్ధేశ్వరస్వామి మందిరంలో జ్ఞానదేవుడి సమాధి నిత్యం పూజలు అందుకుంటూ ఉంది. ప్రజలకు ఆధ్యాత్మిక జ్ఞాన

(మిగతా 19వ పేజీలో)

పొదుపు విలువ

కథ



అమ్మా నాన్నా ఇచ్చే డబ్బులు ఎప్పటికప్పుడు ఖర్చుచేస్తాడు బుజ్జిగాడు. వాడికి పొదుపనేదే లేదు. ఎంత ఇస్తే అంత గుండంలో వేసేస్తాడు. వాడికి స్నేహితులు ఎక్కువ. వారితో గడపటం వాడికి సరదా. అలా చేయటం చాలా తప్పని, ఇచ్చిన దానిలోనే కొంత దాచుకోవాలని అనేకసార్లు చెప్పారు అమ్మానాన్న. వాడు వింటేనా? విచ్చల విడిగా మంచి నీళ్లలా ఖర్చుచేస్తున్నాడు తప్ప, పొదుపనేది పాటించటం లేదు. 'వీడు ఇలాగే ఖర్చు చేస్తూ ఉంటే ముందు ముందు బాగా ఇబ్బంది పడతాడు. డబ్బు విలువ బాల్యంలోనే గుర్తించాలి. వీడిలో మార్పు వచ్చేది ఎలా?' అని మథన పడుతున్నారు తల్లిదండ్రులు.

ఓరోజు నాన్నను పీడించి వందరూపాయలు తీసుకున్నాడు. బడికి పరుగెత్తాడు. స్నేహితులతో గడిపాడు. ఏవేవో కొనుక్కుతిన్నారు. పైసా కూడా మిగలలేదు. సాయంత్రానికి ఇల్లుచేరాడు.

ఇంట్లో నాన్నలేడు. అమ్మకు జ్వరం వచ్చింది. మూలుగుతోంది. ఏమిచేయాలో పాలుపోలేదు. కాలుచేయి ఆడక ఆర్‌యంపి డాక్టర్‌ను తీసుకువచ్చాడు. ఆయన పరీక్షించి మందులు రాశాడు, అర్జంటుగా తెమ్మన్నాడు. అమ్మ దగ్గర డబ్బులులేవు. నాన్న ఊళ్లోలేడు. మందుల షాపులో అప్పు ఇవ్వలేదు. తెలిసినవారినందరినీ అడిగాడు. అందరూ లేవన్నారు. స్నేహితులను అడిగాడు. ప్రయోజనం లేదు. అమ్మ బాధ చూడలేకపోయాడు.

అప్పుడు అర్థమైంది. తాను పనికిమాలిన స్నేహితులకోసం ఖర్చుచేయకుండా ప్రతిరోజు దాచుకుని ఉంటే ప్రస్తుతానికి అక్కరకు వచ్చేవికదా అని బాధపడ్డాడు. ఖర్చుచేయటానికి కాసేపు పట్టదు. సంపాదించటం చాలా కష్టమని గ్రహించాడు. అవసర కాలంలో ఆదుకునేవి సొంత డబ్బులే అని తెలుసుకున్నాడు.

అంతలో అమ్మ పిలిచి గూట్లో ఎప్పుడో వంద రూపాయలు దాచిన విషయం గుర్తుకు వచ్చిందని, వెళ్లి చూడమని చెప్పింది.

బుజ్జిగాడు పరుగున వెళ్లి చూశాడు. నిజమే. వందరూపాయలు ఉన్నాయి. 'ఉన్నాయమ్మా. నే వెళ్లి మందులు తెస్తా' అంటూ వీధిలోకి పరుగుతీశాడు. మందులు తెచ్చి అమ్మకు ఇవ్వడంతో బుజ్జిగాడి మనసు తేలికపడింది. 'హమ్మయ్య. అమ్మకు ఇంక తగ్గిపోతుంది' అనుకున్నాడు.

అదే సమయంలో పొదుపు విలువ ఏమిటో బుజ్జిగాడికి బోధపడింది. ఆరోజునుంచి వృధాగా ఖర్చుచేయడం మానేశాడు. పొదుపుచేయడం మొదలుపెట్టాడు. వాడిలో మార్పు చూసి అమ్మానాన్న సంతోషించారు.

–దార్ల బుజ్జిబాబు, చిలకలూరిపేట.

దారి చూపుతారా?

రంగులు వేయండి



బాలలూ! పై బొమ్మకు పక్కన వృత్తాలలో ఏయే అంకెల వద్ద ఏయే రంగులు వేయాలో సూచన ఉంది. ఆ ప్రకారం బొమ్మకు రంగులు వేయండి.

ఎవరు ఎందుకు?

బాలగీతం

సూర్యుడు తూర్పున ఉదయిస్తే
ఆకాశాన్ని చీల్చుకు వస్తుంది
వేడిమి, వెలుతురు అందిస్తుంది
విశ్వంలో జీవులకు జీవం పోస్తుంది!

నింగిన చంద్రుడు ఉదయిస్తే
చంద్రుని చేరగ తారలు వస్తాయి
చల్లని కాంతులు అందిస్తాయి
అమృత బిందువులొలికిస్తాయి!

గాలి శూన్యాన్ని చీల్చుకు వస్తూ
భూమండలంలో అడుగిడుతుంది
చల్లని గాలి వీచికలను అందిస్తుంది
జీవులకు ప్రాణాధారం అవుతుంది!

నీలిమేఘం ఆకాశంలో విహరిస్తుంది
వర్షపు జల్లుల రూపం దాల్చి
భూమండలంలో విహరిస్తుంది
జీవుల దాహార్తిని తీరుస్తుంది

విత్తు భూమిని చీల్చుకు వస్తుంది
పచ్చదనంతో ఆక్సిజన్ అందిస్తుంది
జీవరాసులకు ఆకులు, అలములు
కాయలు, పండ్లను సమకూర్చేస్తుంది!

–శివ్వాం ప్రభాకరం
బొబ్బిలి

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

జి.లాస్య, విశాఖ.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. ఆకాశం కేసి అలాగే చూస్తూ ఉంటే రంగులేవీ స్థిరంగా ఉన్నట్లు అనిపించదు. మరి ఆకాశం నిజమైన రంగు ఏది? దయచేసి చెప్పండి.

జవాబు: లాస్యా! ఆకాశం నీలంగాను, మబ్బులు వెండిలా తెల్లగాను కనిపించటం సాధారణం. అయితే మబ్బులు దట్టంగా ఏర్పడటానికి ముందు ఒక్కోసారి ఎర్రగా కనిపించే ఆకాశం అంతలోనే నల్లనిమబ్బులతో నిండిపోతుంది. ఎన్నో రంగులు మారే ఆకాశం నిజమైన రంగు నలుపే. మరి ఆకాశం నల్లగా ఎందుకుంటుందీ అంటే.. భూమిపైన కొన్ని వేల కి.మీ.కు వెళ్లి చూస్తే ఆకాశమంతా నల్లగానే ఉంటుంది. వాతావరణం మూలంగానే ఆకాశానికి నీలి రంగు వస్తుంది. కొన్నివేల కి.మీ. ఎత్తున వాతావరణం లేకపోవటంవల్లనే ఆకాశం అక్కడ నల్లగా ఉంటుంది. మన వాతావరణంలో ధూళి. నీటి ఆవిరి, వాయుకణాలు ఉంటాయి. సూర్యకాంతి వాటిమీద ప్రసరించినప్పుడు ఆ కాంతిలోని నీలికిరణతరంగాలను మాత్రం అవి చెదరగొడతాయి. మిగిలిన ఆకుపచ్చ, నారింజ, ఎరుపురంగు కిరణ తరంగాలు పొడవైనవి కావటం చేత వాతావరణాన్ని దూసుకువస్తాయి. నీలిరంగు కాంతిభాగం అక్కడే చెల్లాచెదురైపోతుంది. అందుకనే ఆకాశం నీలంగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఇంకా స్పష్టంగాచెప్పాలంటే కాంతికిరణాలు భూవాతావరణంలోని నైట్రోజన్, ఆక్సిజన్, ధూళి అణువుల మీద ప్రసరించినప్పుడు నీలి రంగు మాత్రమే అధికస్థాయిలో పరిక్షేపణం చెందుతుంది. అంటే బాగా ఎక్కువస్థాయిలో చెదిరిపోతుంది. ఈ కారణంతోనే చెదిరిపోయిన నీలంరంగులోనే ఆకాశం కనిపిస్తోంది.

ఎన్.చేతన్, మెదక్.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఏడో తరగతి చదువుతున్నాను. దోమల సంగీతం అని తుమ్మెదలు ఝుంకారం అని అంటుంటారు కదా. మరి ఆ కీటకాలు ఆ ధ్వనులను ఎలా చేస్తున్నాయి?

జవాబు: చేతన్! నిజానికి కీటకాలు ఏ శబ్దాన్ని చేసినా, అవి తమ నోటితో చేయవు, చేయలేవు. గాలిలో వాటి కదలికల వలన, ఆయారీతులను అనుసరించి వచ్చే శబ్దాలను మన ఇష్టప్రకారం ఆయా రకాలుగా భావిస్తాం. గాలిలో వేగంగా రెక్కలు కదపడం వలన ఆయా శబ్దాలు వెలువడుతాయి. దోమ, ఈగ, తుమ్మెద, తేనెటీగలు ఎంతో వేగంగా పరిభ్రమించడం వలన మనకు అవి శబ్దాల మాదిరిగా వినిపిస్తాయి.

ఆహారం.. ఆరోగ్యం

ఆహారం అనగానే వరి, గోధుమ, జొన్న మొదలైనవి మాత్రమే గుర్తుచేసుకుంటారు. కానీ ప్రాచీనకాలం నుంచి మనవాళ్లు ఎన్నెన్నో రకాల ఆహార పంటలను పండిస్తు న్నారు. అయితే ప్రస్తుతకాలంలో వాటినన్నింటిని చిన్న చూపుచూస్తూ ఏవో కొన్నింటిని మాత్రమే ఎక్కువగా పండించడం, ఎక్కువగా వినియో గించడం జరుగుతోంది. నిజానికి మనం విస్మరిస్తోన్న ఆయా ఆహారపంటలలో శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు న్నాయి. ఆహారం సమగ్రంగా, సమతుల్యంగా ఉంటే జబ్బులు మనిషి దరికి చేరవు. ఇటీవలి కాలంలో ఆరోగ్యకరమైన జీవనశైలి పట్ల చైతన్యం పెరుగుతోంది. పట్టణాలలో ఆరోగ్యాన్ని పెంపొందించే సంప్రదాయ పంటల పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యానికి మేలుచేసే కొన్ని 'రతనాల' పంటలు, కొన్ని ప్రత్యేకమైన కాయలు, దుంపల గురించి ఇక్కడ...

దయానా రైస్: వీటిని ఎక్కువగా కర్నాటకలో పండిస్తారు. వీటిని పాక్షికంగా మరిగిస్తారు. వీటిలో విటమిన్లు, ఖనిజాలు బాగా ఉంటాయి. ఇందులో పీచుపదార్థం ఎక్కువగా, తక్కువ స్థాయిలో షుగర్ ఉంటాయి. ఇవి రక్తంలోకి షుగర్‌ను నెమ్మదిగా విడుదల చేస్తాయి కాబట్టి దయాబెటిస్ ఉన్నవారికి ఇవి మంచివి. డైటింగ్ చేసే వారికి కూడా ఇవి ఎంతో మంచివి.

ఝుంగోర:

ఉత్తరాఖండ్‌లో వీటిని ఎక్కువగా పండిస్తారు. వీటిని హిందీలో సావక్ లేదా స్యామా కా చావల్ అని పిలుస్తారు. ఝుంగోరలో ఎక్కువ స్థాయిలో ప్రొటీన్, కాల్షియం, ఐరన్, ఖనిజాలు, విటమిన్ బి కాంప్లెక్స్ ఉంటాయి. అంతే కాదు, కార్బొహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి.

జమున్ పౌడర్:

ప్రొటీన్, కాల్షియం, ఐరన్, మినరల్స్, యాంటిఆక్సిడెంట్లు ఇందులో ఉంటాయి. కొలెస్ట్రాల్‌ను ఇది తగ్గించడమే కాదు, జీర్ణశక్తికి, చర్మ ఆరోగ్యం, కంటిచూపుకు బాగా పనిచేస్తుంది. దయాబెటిక్ పేషెంట్లలో బ్లడ్ షుగర్ స్థాయిని అదుపు చేయటానికి జమున్ సాయపడుతుం ది. జమున్ విత్తనాలలో ఉండే జంబోలిన్ అనే పదార్థం గంజిలాంటి పదార్థాన్ని షుగర్‌గా మారకుండా నివారిస్తుంది. జార్ఖండ్‌లోని గిరిజన రైతుల సహకార సంఘాలు జమున్ పొడి తయారీయే జీవికగా ఉన్నాయి.

వెదురుబియ్యం:

వెదురుబియ్యంలో పీచు పదార్థం, కేలరీలు ఎక్కువగా ఉంటాయి. ఇవి వెదురు పూలలో ఉండే విత్తనాలు. వీటిని కర్నాటకలోని గిరిజనులు సేకరిస్తారు.స్థానికంగా దీన్ని ములాయిరి అంటారు. అయితే వీటిని సేకరించటం చాలాకష్టం. ఎందుకంటే వెదురుచెట్లు పుష్పించడం 5 ఏళ్లనుంచి 50 ఏళ్ల వరకు ఎప్పుడైనాజరగవచ్చు. దాన్ని అంచనా వేయడం కష్టం. ఇది కొద్దిగా తీపి.. గోధుమ మాదిరి రుచి కలిగి ఉంటుంది. దీన్ని గోధుమకు, బియ్యానికి బదులుగా వాడుకోవచ్చు. ఇది డిటాక్సిఫికేషన్‌కు తోడ్పడుతుంది. కీళ్లనొప్పులను ఉపశమింపజేస్తుంది.

లకడాంగ్ టర్మరిక్: మేఘాలయలో పండించే లకడాంగ్ పసుపును ప్రపంచంలోని శ్రేష్ఠమైన పసుపుల్లో ఒకటిగా పరిగణిస్తారు. దీని వేళ్లు, బుడిపెలను దంచి, పొడిచేసి జైంటియా హిల్స్ వద్దగల స్థానిక మార్కెట్లలో అమ్ముతారు. ఇందులోని కర్క్యుమిన్ (శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్) 6నుంచి 7శాతం ఉంటుంది. ఇతర పసుపు రకాల్లో కర్క్యుమిన్ కేవలం 2 లేదా 3 శాతం మాత్రమే ఉంటుంది.

నవారా రైస్: అసాధారణమైన ఈఔషధ శ్రేణి బియ్యం కేరళలోని పాలక్కడ్ జిల్లాలో పండుతాయి. ఆయుర్వేదంలో నవారా బియ్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కేవలం దీన్ని మాత్రమే లేదా వేరే వనమూలికలతో కలిపి కొన్ని రకాల జబ్బులకు మందుగా వాడుతుంటారు. ఈ నవారా రైస్ పొట్టు నుంచి తీసిన నూనెను సర్వైకల్ స్పాండిలోసిస్, బిగుసుకున్న కీళ్లు, వెన్నునొప్పి, కీళ్ల నొప్పులకు వాడతారు. కేరళలో ఈ బియ్యాన్ని మరిగించిన నీటి డికాక్షన్‌ను కర్కిడకకంజి అని పిలుస్తారు.

కచయ్ లెమన్: మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో కచయ్ గ్రామం ఉంది. ఇక్కడ ప్రత్యేకమైన నిమ్మకాయలు దొరకుతాయి. వీటిని 'కచయ్ లెమన్' అని పిలుస్తారు. వీటిలో ఎస్కార్బిక్ యాసిడ్ (విటమిన్ సి) ఉంటుంది. సిట్రస్ ఫలాలలో విటమిన్ సి అత్యధికంగా ఉన్నది కచయ్ లెమన్‌లోనే.

2005 నుంచి, ఐసిఎఆర్, మణిపూర్ స్మాల్ ఫార్మర్స అగ్రి-బిజినెస్ కన్సార్టియమ్, మణిపూర్ ఆర్గానిక్ మిషన్ ఏజెన్సీలు కచయ్ లెమన్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తూ వీటి ప్రాముఖ్యానికి, ఉత్పాదకతను ప్రోత్సహించ డానికి తోడ్పడుతున్నారు.

మున్సియారి వైట్ రాజ్మా: రాజ్మా అంటే ఇష్టపడేవారు మున్సియారి రకానికి చెందిన కిడ్నీ బీన్స్‌ను తినడం మంచిది. ఉత్తరాఖండ్‌లోని మున్సియారిలో వీటిని ఎక్కువగా పండించడంవల్ల వీటికి ఈపేరు వచ్చింది. సారవంతమైన హిమాలయ లోయలలో పండే మున్సియారి రాజ్మా తీయటి ప్రత్యేక వాసన కలిగి ఉంటుంది. అంతేకాదు మామూలు రాజ్మాను ఉడికించే సమయం కంటే మున్సియారి రాజ్మా త్వరగా ఉడుకుతుంది. ప్రొటీన్లు ఎక్కువగా, పీచుకలిగి ఉండే ఈ రాజ్మా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంతో పాటు కణాలు బాగయ్యేందుకు తోడ్పడుతుంది.

భలియా వీట్: గుజరాత్‌లోని భల్ ప్రాంతంలో పొడవుగా ఉండే గోధుమ రకం పండుతుంది. ఆ ప్రాంతం పేరుమీదుగా వీటిని 'భలియా వీట్' అని పిలుస్తున్నారు. తేమగల భూముల్లోనే ఈ గోధుమ పండుతుంది. స్థానికంగా దీన్ని దౌద్‌ఖాని వీట్ అని పిలుస్తారు. వీటిలో ప్రొటీన్ పరిమాణం ఎక్కువగా, కెరొటిన్ అధికంగా ఉండి, తక్కువ నీటిని పీల్చుకోనే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. పాస్తా, నూడిల్స్, వర్మిసెల్లి, పిజ్జా వగైరాల తయారీకి దీని వాడకం మంచిది.

రెడ్ రైస్: వైట్ రైస్ కంటే వీటిలో అత్యధికంగా యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. రెట్టింపు జింక్, ఐరన్ ఉంటాయి. భారత్‌లో ప్రధానంగా మూడుచోట్ల .. హిమాచల్‌లోని సిమ్లా వేలీ (ఇక్కడ రెడ్‌రైస్‌ను చొహార్తు అంటారు), మహారాష్ట్రలోని పట్ని (ఇక్కడ పట్ని అంటారు), కేరళలోని పాలక్కడ్ ప్రాంతంలో (ఇక్కడ మట్టా రైస్ అంటారు) పండు తాయి. తక్కువ సుగర్ ఉండే ఈ ఎర్ర బియ్య రకం షుగర్ వ్యాధి గ్రస్తులకు ఎంతో మేలు చేస్తుంది.

గార్లిక్ రాక్ సాల్ట్: హిమాచల్ ప్రదేశ్‌లో దొరికే సహజమైన రాకీసాల్ట్‌ను వేయించిన వెల్లులితో కలుపుతారు. ఆరోగ్యరీత్యా ఇది ఎంతో మంచిది. అయోడైజ్డ్ టేబుల్ సాల్ట్‌లాగా రుచి కూడా బాగుంటుంది. ఆయు ర్వేదంలో ఈ రాళ్ల ఉప్పుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ రాళ్ల ఉప్పు జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. శరీరం పనితీరును పెంచుతుంది. రక్తపోటును తగ్గిస్తుంది, షుగర్ స్థాయిని తగ్గిస్తుంది. హైపర్ టెన్షన్‌తో బాధ పడేవారికి, అలాగే డయాబెటిక్ రోగులకు ఈ రాక్‌సాల్ట్ ఎంతో మంచిది.

కర్బి అంగ్‌లాంగ్ జింజర్: అస్సాంలోని కర్బి అంగ్లాంగ్ జిల్లాలో ప్రపంచంలోనే ఉత్తమమైన ఆర్గానిక్ అల్లం పండుతుంది. కానీ ఈ విషయం ఇండియాలోనే అందరికీ తెలియదు. పీచు తక్కువగా, పోషకాలు ఎక్కువగా ఉండే ఈ అల్లం శొంఠిగా ఎక్కువ పరిమాణంలో లభ్య మవుతోంది. దీన్నుంచి వచ్చే నూనెను ఆహార పరిశ్రమలో వాడతా రు. కండరాల నొప్పులు, వికారం వంటి బాధల నివారణకు ఇది బాగా పనిచేస్తుంది.

నెటిల్ లీఫ్ టీ: ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఇది ఎక్కువగా పండుతుంది. రక్త హీనత, కీళ్ల నొప్పుల నుంచి శ్వాస సంబంధ వ్యాధులు, మూత్ర సంబంధ ఇన్‌ఫెక్షన్‌వరకు అనేక సమస్యలకు ఇది బాగా పనిచేస్తుంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో దీన్ని విరివిగా వినియోగిస్తారు. స్థానికంగా దీన్ని బిచూ బుటి లేదా షిషూ సాగ్ అని పిలుస్తారు. ఈ ఆకును నీళ్లలో మరగించి టీ తయారు చేసుకోవటం చాలా సులభం. రక్త శుద్ధికి, కండరాల నొప్పులు, ఇతర నొప్పులకు ఇది బాగా పనిచేస్తుంది.

చక్ హావ్ బ్లాక్ రైస్:

మణిపూర్ కొండప్రాంతాల్లో ఇవి బాగా పండుతాయి. గుండెజబ్బుల వారికి ఈ బ్లాక్ రైస్ ఎంతో మంచివి. పాలిష్ చేయని, పర్పుల్‌రంగులో ఉండే ఈ బ్లాక్ రైస్‌లో విటమిన్లు, ఖనిజాలు, ఐరన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. అతుక్కునేలా ఉండే ఈ బ్లాక్ రైస్ తీయని రుచి కలిగి ఉంటాయి. వీటితో ఖీర్ తయారుచేస్తారు. గుండె జబ్బులు, స్థూల కాయం, క్యాన్సర్ వగైరా వ్యాధుల నుంచి రక్షణకు ఈ బ్లాక్ రైస్ వాడకం ఎంతగానో తోడ్పడుతుంది.

ఆహారంపట్ల చైతన్యవంతంగా ఉంటే ఆరోగ్యం పట్ల చైతన్యంతో ఉన్నట్లే!

జ్ఞానదేవుడి విశ్వప్రేమ

(15వ పేజీ తరువాయి)

రోచిస్సులను అందిస్తూనే ఉంది. భారతీయ ధర్మంలోని 'గంగానది' లక్షణానికి నిరూపణగా జ్ఞానదేవుడు ఆరంభించిన భక్తి ఉద్యమం, ఆయన సమాధి తరువాత వెల్లువై భారతీయ ధర్మాన్ని విదేశీ ధర్మ వెల్లువకు అడ్డుకట్ట వేసి తననితాను సజీవంగా ఉంచుకోవటంలో తోడ్పడింది. ప్రపంచానికి ప్రేమ మరో స్వరూపాన్ని ప్రదర్శిస్తూ అలరిస్తున్నాయి ఆయన రచించిన అభంగ్‌లు.

విశ్వాంచే ఆర్తచ మాఝెమణి ప్రనావలే!
అవఘే చి భావేం దేహబ్రహ్మ

సకల విశ్వం వాంఛించే సత్యాన్ని నేను గ్రహించాను. నా జీవితం నా అస్తిత్వం బ్రహ్మలో లీనమయింది.

'ఆవడీచె వాలోభ మాఝెని కోందాటలే!
నవల దేఖిలేం నభా కార్ గో మాయె

ఈ విశ్వంలో నిండిన దివ్యాత్మానుభవంతోటే విశ్వప్రేమ నా అణువణువునా నిండింది.

కథ

జయం

అప్పుడు సమయం సాయంత్రం ఆరు గంటలు.

ఆకాశం అంతటా అరుణ వర్ణాన్ని పరుస్తూ సూర్యుడు అందంగా ప్రకాశిస్తున్నాడు.

పక్షులు కిలకిల రావాల శబ్దాలు చేస్తూ సందడిగా గూళ్లకి చేరుతున్నాయి.

పార్కులో ఒంటరిగా కూర్చున్నాడు 'జై'.

పార్కులో అందంగా వున్న పూలమొక్కల నుండి పరిమళభరితమైన సువాసనలు వస్తుంటే అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

అప్పుడప్పుడు వీస్తున్న చల్లని చిరుగాలుల స్పర్శతో పూలమొక్కలు కదులుతున్నాయి.

పార్కులో చిన్నారులు రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు. కేరింతలు కొడుతూ ఉల్లాసంగా పరుగులు తీస్తున్నారు.

పచ్చగా మెరుస్తున్న పార్కు సందడిగా... కోలాహలంగా వుంది.

ఓ పక్కగా వున్న బెంచ్‌పై ఒంటరిగా, దిగులుగా కూర్చున్నాడు 'జై.

అక్కడి అంత అందమైన.. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అతడు పట్టించుకునే స్థితిలో లేదు.

అందుకు కారణం లేకపోలేదు.

అతడి కళ్లు పార్కులో ఎవరికోసమో అన్వేషిస్తున్నాయి.

సునంద రాకకోసం చాలాసేపటి నుండి అతడి ఎదురుచూపులు.

నిరీక్షిస్తున్న అతడికి నిరాశే మిగిలింది.

'తనిక రాదేమో!' అన్న ఆలోచన అతడి మదిలో మరింత అలజడికి కారణం అవుతుంది.

అంతకంటే మరింత ఎక్కువగా అతడి ఆలోచనల్లోకి వచ్చింది మరో విషయం.

నిన్నటి తన ఇంటర్వ్యూ రిజల్ట్.

- గొర్రెపాటి శ్రీను

తను ఇంటర్వ్యూకి వెళ్లిన ఆఫీసువారి నుండి ఉదయం ఫోన్‌కి వచ్చిన మెసేజ్.

'యు ఆర్ నాట్ సెలక్టెడ్'

తను ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు...ఈ ఉద్యోగం

తప్పకుండా తనకే వస్తుందని!

ఈ సంతోషకరమైన వార్త సునందతో పంచుకోవాలని.

తన నుండి బెస్ట్ విషెస్ అందుకోవాలని ఎన్నో కలలు కన్నాడు తను.

తన ఇంజినీరింగ్ పూర్తయి దాదాపు సంవత్సరం కావస్తుంది.

రకరకాల ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు.

కానీ నేటివరకూ సరి అయిన ఉద్యోగాన్ని అందుకోలేకపోయాడు.

ఏదో ఓ చిన్న ఉద్యోగాన్ని సంపాదించుకుని కాలాన్ని గడిపేయాలంటే మనస్సు ఒప్పుకోవడం లేదు.

తన ప్రయత్నాలు ఫలించడం లేదు.

ఒకవేళ...

ఈ వేళప్పుడు సునంద వస్తే....

తనకి జరిగిందంతా ఎలా చెప్పాలి?

తనకంటే కాలేజీలో వన్ ఇయర్ జూనియర్ సునంద.

సునంద ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ నిన్నటితో పూర్తయ్యాయి.

ఇక హాలిడేస్‌లో తను ఊరు వెళ్లిపోతుందేమో!

ఈ రోజు తనని కలవకపోతే మళ్లీ ఎప్పుడు కలుస్తుందో!

మార్నింగ్ నుండి తన నుండి ఎటువంటి రెస్పాన్స్ లేదు.

ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదు.

దిగులుగా వున్న అతడి చూపులు అసంకల్పితంగా పక్కనే ఉన్న ఓ పూలమొక్కపై నిలిచాయి.

ఒంటిరెక్క పూవు.

తన వైపే చూస్తున్నట్లుగా గమ్మత్తుగా అగుపిస్తుంది.

ముద్దుగా ముచ్చటగా వుంది.

చేత్తో తాకాలనుకుంటూ ఆగిపోయాడు.

కాస్త దూరంలో ఎగురుతున్న ఓ తూనీగ వచ్చి ఆ పువ్వుపై వాలింది.

అంతే! ఒక్కసారిగా పూర్తిగా పక్కకి ఒరిగిపోయింది ఆ చిన్ని పువ్వు వున్న మొక్క.

కొన్ని క్షణాలు ఆగిపోయాడు 'జై'.

తూనీగ లేచి ఎగిరి వెళ్లిపోయింది.

అంతే.

ఒక్కసారిగా నిటారుగా లేచి నిలబడింది ఆ మొక్క.

ఓ గొప్ప జీవిత సత్యాన్ని బోధిస్తూ అందంగా నవ్వింది ఆ పువ్వు!

ఎందుకో తెలియదు.

అతడి మనస్సంతా ఆనందం.

అతడి పెదవులపై నవ్వు సమ్మోహనంగా విరిసింది.

జీవితం అన్న తరువాత కష్టసుఖాలు సహజం.

కష్టాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

అటువంటి నిస్సహాయ స్థితిలో ధైర్యంగా వుండాలి.

ఓటమి తరువాత విజయం తప్పకుండా సిద్ధిస్తుంది.

ఆ చిన్ని పువ్వు వున్న మొక్క అందిస్తున్న స్ఫూర్తిని అందుకుంటూ ధైర్యంగా లేచాడు.

ఇప్పుడు అతడి మనస్సు ఉల్లాసంగా వుంది.

ప్రకృతి అందంగా కనిపిస్తోంది.

ఆలోచనలు గతంలోకి దారి తీశాయి.

సునంద తలపుల్లో మెదులుతుంది.

తన ఫస్ట్ ఇయర్ పూర్తియి కాలేజి రీ ఓపెన్ అవుతుండగా...

ఫస్ట్ ఇయర్‌లో కొత్తగా జాయిన్ అయింది సునంద.

* * *

స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజ్.

ఉదయం ఎనిమిది గంటల సమయం.

మొదటి సంవత్సరం స్టూడెంట్స్ రాకతో కాలేజ్ వాతావరణం అంతా సందడిగా వుంది.

సీనియర్స్ తమ జూనియర్స్‌ని పరిచయం చేసుకుంటున్నారు.

సీనియర్స్ అడిగిన ప్రశ్నలకి సమాధానాలు ఇస్తూ జూనియర్స్ కాలేజ్‌లోకి ప్రవేశిస్తున్నారు.

కాలేజ్ లోనికి ప్రవేశించడానికి వున్న దారికి ఇరు వైపుల వున్న అశోక వృక్షాల నుండి చల్లని గాలి హాయిగా వీస్తుంది.

సునంద కాలేజ్‌లోకి అడుగు పెడుతుంటే...

యువతీ యువకుల అందరి చూపులు అటువైపు తిరిగాయి.

అందానికి సరి అయిన నిర్వచనంలా తను.

నీలి రంగు డ్రెస్‌లో...

చెవులకు ఊగుతున్న అందమైన ఇయర్ రింగ్స్, చల్లని గాలికి అల్లరిగా కదులుతున్న నల్లని కురులు, కోటికాంతులు వెదజల్లుతూ మెరుస్తున్న కాటుక కళ్లు.

నవ్వుతుంటే తళుక్కున మెరుస్తున్న పలువరుస.

అందం... ఆనందంల మేలుకలయికలా తను.

ఓ చల్లని మలయమారుతం అలా అలా కదిలి వెళుతున్నట్లుగా తను నడుస్తుంది.

ప్రపంచంలోని అందం అంతా రాశిలా పోసి రూపమిచ్చిన అపరంజి బొమ్మలా వుంది.

తను కూర్చున్న చోటునుండి లేచాడు జై.

హృదయంలో ఏదో తెలియని అలజడి.

తన ఉచ్ఛ్వాస నిశ్వాసల గమనం.

లయబద్ధమైన శబ్దం.

తనకే స్పష్టంగా వినిపిస్తుంది.

తన స్వప్నాల్లో అగుపించే అమ్మాయా?

తన ఊహల్లో మెరిసే లావణ్యమా?

చూపులు సునందపై నిలిచిపోయాయి.

'జై' సునంద ఎదురుగా నిలుచున్నాడు.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' నిజమే! అనుకున్నాడు.

అతడిపై సునందకి ఎలాంటి ఫీలింగ్ కలిగిందో....

"మై నేమ్ ఈజ్ సునంద" వీణ మీటినట్లుగా పలికింది స్వరం.

అతడి నయనాల నిండా నిండిపోయింది సునంద రూపం.

"లవ్ యూ డియర్..."

మాటల్లో చెప్పలేక కళ్లనిండా ఆరాధనా భావాన్ని నింపుకుని లాలనగా చూశాడు.

ఏమనుకుందో... చిన్నగా కళ్లు ఆర్పి తెరిచింది.

చిరునవ్వు నవ్వింది సునంద.

* * *

సమ్మర్ హాలిడేస్‌లో కాలేజ్‌కి సెలవులు.

అంటే తను ఊరు వెళ్లిపోతుంది.

సునందకి తను ప్రేమిస్తున్న సంగతి చెప్పాలనుకున్నాడు 'జై'

తీరా చెప్పాక తను ఏమనుకుంటుందో... ఎలా స్పందిస్తుందో!

ధైర్యం చాల్లేదు.

అలా...అలా జై ఇంజినీరింగ్ పూర్తయి కాలేజ్ నుండి బయటకు రావడం...

ఓ సంవత్సరంపాటు ఉద్యోగం కోసం రకరకాల ప్రయత్నాలు చేయడం.

అవేవీ సఫలం కాకపోవడం జరిగింది.

ఇప్పుడు...

సునంద ఇంజినీరింగ్ పూర్తయింది.

అంటే తన కాలేజ్ నుండి ఊరు వెళ్లిపోతుంది.

తరువాత ఏం జరుగుతుందో...

ఊహించలేకపోతున్నాడు 'జై'

తన రాక కోసం నిరీక్షిస్తూ...

ఇలా...

ఇక్కడ పార్కులో...

ఒంటరిగా..!

ఓ చిన్న సంఘటన.

'జై'లో స్ఫూర్తిని నింపుతూ...

ఇప్పుడతని ఆలోచనలు పాజిటివ్‌గా సాగుతున్నాయి.

ఏదైనా ఒక పనిని ప్రారంభించే ముందూ పనిని మనం చేయగలమా? లేదా? అన్నది అంచనా వేయగలగాలి.

చేయగలమన్న నమ్మకం కుదిరాక...

లేదూ అడుగు ముందుకు వేశాక....

విజయాన్ని అందుకునే వరకూ అవిశ్రాంతంగా శ్రమించాలి.

ఏ స్థితిలోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోరాదు.
చేస్తున్న పనిని ప్రేమించగలిగితే తప్పకుండా సత్ఫలితాలు వస్తాయి.
తన అపజయానికి కారణం ఏంటి?
విశ్లేషించుకోసాగాడు... ఆచరణ లేని ఆలోచన వ్యర్థం.
ఓ మంచి ఆలోచన కార్యరూపం దాలిస్తే దాని ఫలితాలు కూడా ఉత్తమంగా... ఉన్నతంగా వుంటాయి.
తనని తాను నిందించుకుంటూ జరిగిపోయిన గతాన్ని తలుచుకుంటూ మధన పడడంకంటే అందమైన భవిష్యత్తును నిర్మించుకునే దిశగా ప్రయత్నాలు ప్రారంభించాలి... అనుకున్నాడు.
తాను నవ్వింది. ఆచరణయోగ్యమైన ఓ పనిని తక్షణమే ప్రారంభించాలనుకున్నాడు.
అందుకు వేదికగా నిలిచింది సిటీ సెంట్రల్ లైబ్రరి.
తన కాలేజ్ బుక్స్ రీ-ఓపెన్ చేసి చదువుకోసాగాడు.
సిటీ లైబ్రరిలోని ఎన్నో పుస్తకాలు...
జ్ఞానాన్ని, మనోవికాసాన్ని, మేధా సంపత్తిని అందిస్తూ-
ఒక్కొక్కటిగా చదువుతుంటే...
మనస్సు ఏదో తెలియని అద్భుతమైన ఆనందానికి లోనవుతోంది.
ఉన్నతమైన సంస్కారాన్ని అందుకోసాగాడు.
లైబ్రరీకి వెళ్లడం అతడి దినచర్యలో భాగం అయింది.
స్నేహితులతో కలసి రూంలో వుంటున్నాడు.
ఫర్వాలేదనిపించే ఉద్యోగం సంపాదించాడు.
శ్రమ విలువ తెలుసుకుని చిన్నదైన ఉద్యోగానికి సైతం రెగ్యులర్‌గా వెడుతూ మంచిపేరు తెచ్చుకున్నాడు ఆఫీసులో.
'My experiences with truth' మహాత్మాగాంధిగారి జీవిత చరిత్ర.
'Wings of fire' లాంటి మనోవికాసాన్ని కలిగించే రచనలు ఎన్నో చదివాడు.
ఇప్పుడు అతడికి లోకం అంతా కొత్తగా అగుపిస్తోంది.
చదువు ఎంతో విలువైనది.
మనోవికాసాన్ని కలిగిస్తుంది.
నలుగురిలో గుర్తింపు, గౌరవాన్ని అందిస్తుంది.
నీ కాళ్లపై నువ్వు స్వతంత్రంగా నిలబడి బతికే అవకాశాన్ని కలిగిస్తుంది.
ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటున్నాడు.
ఓ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు.
A Journey towards Aim...
తన లక్ష్యం... సునంద ప్రేమని గెలవటం!

* * *

అనుకోకుండా ఓ చక్కని ఉద్యోగం అవకాశం వచ్చింది.
ఎలాగైనా ఈ ఉద్యోగాన్ని సాధించాలనుకున్నాడు 'జై'.
తనలాంటి వాళ్లు ఇరవై మంది వరకు వుంటారక్కడ.
కేవలం రెండే పోస్టులు వున్నాయట.
ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్లందరూ మెరిట్ స్టూడెంట్స్.
కాంపిటిషన్ టఫ్‌గా వుంటుంది.
మొదట రిటెన్ టెస్ట్... ఆపై ఓరల్ టెస్ట్.
కాన్ఫిడెంట్‌గా తన సబ్జెక్ట్ బుక్స్ ప్రిపేర్ అయ్యాడు.
రిటెన్ టెస్ట్‌లో సెలక్ట్ అయ్యాడు.
ఓరల్ టెస్ట్ రెండు రోజుల తరువాత వుంటుందని అయిదుగురికి చెప్పారు.
ఓరల్ టెస్ట్‌లో తనని ఇంటర్వ్యూ చేస్తున్న వారికి సరి అయిన సమాధానాలు ఓపికగా చెప్పాడు.
అతడి విద్యార్హతలు, మాట్లాడే పద్ధతి వారికి ఎంతగానో నచ్చాయి.
సెలక్ట్ అయ్యాడు 'జై'
ఉద్యోగంలో చేరిన తరువాత...
ఓ రోజు...
తను ఎంతో స్ట్రగుల్ అనుభవిస్తూ విశ్రాంతిగా వుంటుందని అప్పుడప్పుడు వెళ్లే పార్కుకి వెళ్లాడు.
ఎప్పుడు తను కూర్చునే ఆ సిమెంట్ బెంచ్‌పై కూర్చున్నాడు.
నిశితంగా పార్కుని గమనిస్తున్నాడు.
ఎప్పటిలా అల్లరిగా అక్కడి వాతావరణం.
ఎప్పుడైనా...
రేర్‌గా ఫోన్ చేస్తుంది సునంద.
ఇటీవల ఫోన్ చేసి చాలా కాలం అయింది.
ఓసారి తనని కలిస్తే...
కలిసి పలకరిస్తే...
ఎలా వుంటుందో కదా!
ఇప్పుడెలా వుందో... ఏమి చేస్తుందో...
అనుకుంటుండగా...
అంతలోనే ఫోన్ రింగ్ అయింది.
కొత్త నెంబర్... చూసుకున్నాడు.
ఆన్ చేశాడు.
"హాలో....!"
అవతల నుండి పరిచయం అయిన కంఠం.
"హాలో!" అన్నాడు.
"నేను సునందని!"
అంతే! ఒక్కసారిగా అతడి మనస్సు ఆనందపరవశం అయింది.
"నేను బాగానే వున్నాను. మీరెలా వున్నారు?"
సునంద అడుగుతుంటే...
"హా... ఐ యామ్ ఫైన్..." అన్నాడు.
తను ప్రస్తుతం ఎలా వున్నాడు.. ఏం చేస్తున్నాడు... చెబుతుంటే శ్రద్ధగా విన్నది.
అతడి మాటలు పూర్తయ్యాక-
"ఒక ఆడపిల్లగా నేను ఇలా మీతో చెప్పొచ్చో లేదో తెలీదు. కానీ నా మనస్సులోని భావాలు మీతో పంచుకోవాలనిపిస్తుంది. ఎప్పుడెప్పుడు మిమ్మల్ని పలకరించాలా.... అనిపిస్తుంది. మీతో కలిసి జీవించాలనిపిస్తుంది. మీరంటే ఇష్టం!
ఐ లవ్ యూ డియర్ జై..."
"ఐ టూ సునంద" అన్నాడు.
తనలా గలగలా మాట్లాడుతుంటే వింటుండిపోయాడు.
పార్కు నుండి బయటకు హుషారుగా నడుస్తున్నాడు జైదీప్. ■

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టులనుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

శిశువీధి

బిడ్డను ముద్దాడడం
ఓ అభ్యాసం, ఓ క్రియ
ఓ జీవన కళ!

* * *

శిశూదయం ఓ లయక్రియ!
జీవిత పర్యంతం పరచుకొని ఉంటుంది!
చిరునవ్వే శిశుభాష!
శిశు హస్తాలు
తల్లుల నడుములు చుట్టుకున్నప్పుడు
పృథ్వి పృథ్వి అంతా
రంగులరాట్నంలా తిరుగుతూ
ఇంద్రధనుస్సులా మెరుస్తూ ఉంటుంది!
శివాయనమః! శివాయనమః!
లోక సన్మానార్థం
పూలగుత్తులు ఈ శిశువులు!
శివాయనమః! శివాయనమః!
శిశు కేరింతలు వినబడీ వినబడకుండా
శిశు హస్తాలు కనబడీ కనబడకుండా
తల్లుల ఒడుల్లో దుఃఖమే నిండుతుంది!
కన్నీటి అభిషేకాలు
వసంతం లాంటి శిశురుతువులని
అందిస్తే బాగుణ్ణు!
జగత్తంతా సంత జీవితమే!
అయినా శిశు జననం
ప్రకృతికి వైభవం!
ఉనికి నైజం
ద్వంద్వాలోచనలు కలిగించినా
శిశువు ఉనికిలోకి రావడం ఓ ప్రగతి!
మాయలోకం
ఎరుకలోకి రావడానికైనా
మాయనుంచి
.... శిశువుని అందించు శివయ్యా!
క్రియ లేని కళ లేదు!
కళ లేనిదే లోకం లేదు!
శిశువీధిని సుసంపన్నం చేయు శివయ్యా!
ఆకాశాన్ని
కళంకారీ అద్దకంగా తీర్చిదిద్దే
సూర్యచంద్రుల్లాంటి ఈ శిశువులు
లోకంలోని
నానావిధ రుణాల్ని విముక్తి చేయడానికి
నేలమీద ఉదయించాలి!

* * *

నమఃశివాయ అంటూ
శిశువీధి మారుమోగుతుంది!

– ఒబ్బిని

బలే బలే దేవతలు

అక్షరం అయిపోయాను
పెదాలు పదాలై
గుండెనిండా వాక్యాలు... యద
అదో ప్రపంచం
స్వచ్ఛత... స్పష్టంగా కనిపిస్తుంది
ఎన్నో మంచి ముత్యాలు
మల్లెల
పరిమళింపులు
గులాబీల
గుబాళింపులు
అక్షర ఆలయంలో
నేను పూజారిని
మాత్రమే.

బడిపిల్లలే దేవతామూర్తులు
ఎల్లలు లేని అనుబంధాలు
ఎనలేని ఆత్మీయతలు
భేషజాలు లేవు
భేదాలు లేవు
కులం, మతం కానరావు
వెన్నముద్దలు, జున్నుముక్కలు
పాలు పంచదార పరమాన్నాలు

అక్కడ మొక్కలు మాటలాడతాయి
గోడలూ గెంతులేస్తాయి
సాక్షాత్తూ దేవుడైనా...
బడిబాలుడై
కాకి ఎంగిలి తిని, క్రాబిల్లా ఆడాల్సిందే
నేను పూజారిని మాత్రమే
బడిపిల్లలందరూ
బలే బలే దేవతలు.

గది ఖాళీ లేదు
బడి పిల్లలకి
పలకా... బలపం దేవతలకు
పాఠాల పంచదార చిలుకలు
అందించాలని సిద్ధమయ్యాను.

– మీగడ వీరభద్రస్వామి

రచనలకు ఆహ్వానం

రచయితలనుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. **రచనలు పంపించాల్సిన చిరునామా:**

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80

సింగిల్ పేజీ కథ

దీపాలి

– యల్. రాజాగణేష్

చిక్కుపడ్డ జుత్తు సరిచేసుకుంది. చుడీదార్ విప్పేసి, చీర కట్టుకుంది. నుదుట స్టిక్కర్ అతి కించుకుంది. పెదాలకు లిప్‌స్టిక్ పూసుకుని, తల్లో మల్లెదండ వేలాడదీసింది. 'దీపాలీ! రావే!' అనరిచింది సుమ. వయ్యారంగా ఊపుకుంటూ వస్తున్న దీపాలికేసి చూస్తూ 'హాయ్!' అంది సుమ. మరోపక్క నుండి జయ, దేవి, వైశూ వచ్చి 'హాయ్!' అని పలకరించారు.

'ఎటెళ్దాం?' అంటూ ప్రశ్నార్థకంగా చూసింది, వైశూ.

'కొత్త గాజువాక నుండి పాత గాజువాక' అంది దీపాలి. అయిదుగురూ అయిదు నిమిషాల్లో కొత్త గాజువాక పెట్రోల్ బంకు దగ్గరికి చేరారు. బంక్ మేనేజర్ ఇరవై నోటు తీసిచ్చాడు. "అయిదుగురం. సరిపోదు మావయ్యా! యాభై ఇవ్వు!" అన్నారిద్దరు. మారు మాట్లాడకుండా మరో పదిచ్చాడతడు. వెనుతిరిగారు. పెట్రోలు పోయించుకుంటున్న లారీడ్రైవరు దృష్టి వారిపై మళ్లింది. అయిదుగురూ చేతులూపి 'హాయ్!' అన్నారు. నవ్వాడతను. దీపాలి అతని దగ్గరగా వెళ్లి 'బావా! తియ్యి' అంది.

పది నోటందించి, 'నీ పేరేవిటి?' అనడిగాడు. 'దీపాలి' అనంటే బుగ్గ నిమిరి గిల్లాడతను. వెంటనే 'నీది సాలూరు కదూ! నువ్వు దీప్‌సాగర్‌వి..' ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు. 'ఔను! నీకెలా తెల్సు?' అంది దీపాలి. 'మందుషాపు దగ్గరుండు. లారీ జింక్ ప్లాంటు దగ్గరుంచి వస్తాను' అన్నాడతను. మందుషాపు దగ్గరికి చేరి 'అందరికీ ఒక్కో పెగ్గివ్వు' డబ్బులందిస్తూ అంది దీపాలి. 'తక్కువిచ్చావ్!' అన్నాడు బ్రాందీషాపు కుర్రాడు. 'ఓ పెగ్గు డబ్బులు మా బోణీకిందేస్కో' అంది. 'లారీ వోడింకా రాలే' అని లోలోనే అనుకుందో, పైకే అనేసిందో తెలీలేదు.

'లైనేసావేటీ.. వస్తానన్నాడా లం..' అంది సుమ. 'లైనా.. పాడా.. తెలిసినోడే' అంది. 'కొంపదీసి.. ఆడూ మన్లాంటోడేనా?' అంది సుమ. ఇంతలో అతను వచ్చాడు. వాళ్లయిదుగురూ హిజ్రాలే! ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. కానీ అందరి చరిత్రా ఒక్కటే. మగాడికి కష్టం సుఖం బంధం ఒకలాంటిది. అలాగే ఆడదాని జీవితంలో కష్టం సుఖం బంధాలూ మరొకలాంటివి. అనుభూతుల స్పర్శ అనుబంధాలూ ఆడా మగా నడుమ ఏకోన్ముఖమే. ఈ సమాజంలో ఏమాత్రం ఆధారం సంబంధం ఆదరణా ప్రేమ అనురాగం నోచుకోని దౌర్భాగ్యమే హిజ్రా జీవితం. సృష్టిలో ప్రతి ప్రాణీ నోచుకున్న ప్రేమ వారికి దొరకక ప్రేమ రాహిత్యం బాధిస్తూనే ఉంటుంది. వాళ్లపట్ల అపహాస్యం బాహాటంగానే ప్రకటిస్తుంటారు చాలామంది. ఒకే ఆకృతి, ఒకే భావజాలం గలవాళ్లు ఈ జనారణ్యంలో ఎక్కడో ఒకచోట ఇమిడుంటారు. సమాజంలో వారిపట్ల కాస్తంత జాలుంది. వారి ఆశీర్వాదం తీసుకుంటే మంచిదన్న అభిప్రాయం ఉంది. వాళ్లని బాధపెడ్తే శపిస్తారని ఒక నమ్మకముంది. అదే వాళ్లను యాచక వృత్తిలో బతికిస్తుంది.

'దీప్‌సాగర్! మాదీ సాలూరే. మీ ఇంటిపక్కనే మా మావయ్య వెంకట్రావిల్లు. జ్ఞాపకం ఉన్నానా? నేను కిశోర్‌ని. స్కూల్లో నీ మీద మూడేళ్ల సీనియర్ని' వచ్చీ రావడంతోనే భుజంమీద చెయ్యేసి అన్నాడు.

'ఆఁ.. జ్ఞాపకమొచ్చింది కిశోర్,' అంది దీపాలి.

"మొన్న మా మావయ్య వెంకట్రావు చచ్చిపోతే వెళ్లాను. మీ అమ్మ నువ్వెక్కడైనా కనిపించావా?" అనడిగింది.

దీపాలి ముఖం చిన్నబుచ్చుకుంది. ఇంకా ఏదో చెప్తాడని మౌనంగా ఉండిపోయింది. 'మా నాన్న చచ్చినా నా మొఖం చూపించొద్దని ఒట్టెట్టాడు కిశోర్. అందుకే సాలూరు రావడం లేదు'

'ఇంకెక్కడి మీ నాన్న... ఎప్పుడో చచ్చిపోయాడు' నిర్ఘాంతపోయింది దీపాలి. రెండు చేతుల్లోనూ ముఖం కప్పేసుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న దీపాల్ని దగ్గరకు లాక్కుని తలపై చెయ్యుంచి నిమిరాడు కిశోర్. చాలా సేపటి తర్వాత "నేనిప్పుడు సాలూరెళ్తున్నాను. నాతోపాటూ వస్తానంటే బయల్దేరు" అన్నాడతను. కిశోర్ లాలనలో సాంత్వన దొరుకుతుంది. ముఖం తుడుచుకుని అతనికేసి చూసింది. కండలు తిరిగిన శరీరం, ఎత్తైన ఛాతీ,చురుకైన ఎర్రటి కళ్లు, మెలి తిరిగిన కోరమీసాలు, కొద్దిగా పెరిగిన అందమైన గడ్డం, యవ్వనం నిండైన మగతనం అతని ముఖంలో ప్రస్ఫుటంగా ఉంది. దీపాలి మనసులో ముద్రితమైన మగరూపం అతనే! దుఃఖంలోనూ పారవశ్యంగా చూస్తూ "కిశోర్ పద. నేనూ సాలూరొస్తాను" అంది దీపాలి. భుజం తట్టి "పద" అన్నాడతను. దీపాలి ఒళ్లంతా తీయని పులకింతకు గురైంది. ఎప్పుడూ ఇంతే! పురుష స్పర్శతో ఒళ్లంతా మైనంముద్దలా కరిగిపోతుంది. కానీ ఒక్క మగాడైనా తనని ఆప్యాయంగా పలుకరించడేం? తన మనోభావాల్ని అర్థం చేసుకోడెందువలన? ఒక ముష్టోడిలాగో, ఒక వ్యంగ్య చిత్రాన్ని చూసినట్టో, ఒక అసహ్యం ఎదురైనట్టో తప్పుకుంటారెందుచేత? లారీ ఎక్కి బోనెట్లో కిశోర్ పక్కనే కూర్చుంది దీపాలి. మరో పక్కగా క్లీనర్ దాసు కూర్చున్నాడు. లారీ శరవేగంతో దూసుకుపోతోంది. దీపాలి చూపంతా చక్రం తిప్పుతున్న శ్రీకృష్ణునిలా కనిపిస్తున్న కిశోర్ బాహువులపైనే నిలిపింది. మరో అయిదు నిమిషాల్లో సాలూరు చేరుకోబోతుండగా ట్రాఫిక్ జాం అయింది. కిశోర్, దీపాలి, దాసు ముగ్గురూ లారీ దిగారు. కాసింత ఇరుకు జాగాలోనే శవ ఊరేగింపు వస్తోంది. అనంత శయనాన్ని వారి ముందరే కిందకి దించారు. నలుదిక్కులా మూడేసి తమలపాకులుంచి అరటిపళ్లు పెడ్తుంటేగాలికి ఆకులెగిరి దీపాలి ముఖంపై పడ్డాయి. ఆ తమలపాకుల్ని అందుకుని ఎగిరిన చోటే ఉంచింది దీపాలి. అరటిపండందుకుని ఆ తమలపాకులపై ఉంచింది. శవానికి నమస్కారం చేద్దామని లేచి నిలుచుంటే కిశోర్ దీపాలిని దగ్గరకు లాగి గుండెలకు హత్తుకున్నాడు. ఆ చర్యకు ఆశ్చర్యంగా తల పైకెత్తి చూసింది. కిశోర్ కళ్లల్లో సన్నటి కన్నీటి పొర నిల్చింది.

"దీప్‌సాగర్! మీ అమ్మ!" శవం వైపు చూపిస్తూ అన్నాడతడు. "అమ్మ... అ....మ్మా!" శవంపై వాలి రోదించింది దీపాలి.

దాస్‌కి లారీని అప్పగించి దీపాలితో పాటూ శవ ఊరేగింపుతో కదిలాడు కిశోర్. శవ దహనమైపోయింది.

"చాలా థాంక్స్ బావ! అమ్మ ఆఖరి ప్రయాణానికి దగ్గర చేసావు. వెళ్లొస్తాను" అంది దీపాలి.

"సాలూర్లో నీ ఇల్లుంది. రెండెకరాల పొలం ఉంది. ఎక్కడికెళ్తావ్?"

"కిశోర్‌బావా! నాదొక్క మాట, వింటావా? విని, సరేనంటావా?"

చెప్పమన్నట్టు చూసాడు కిశోర్.

"నా.. ఈ జీవితంతో బాగా విసిగిపోయాను. నాకో తోడు కావాలి. దాపరికం లేకుండా చెప్తున్నాను. నువ్వు నాక్కావాలి! నా ఇల్లు నీ పేర రాసిస్తాను. ఆ రెండకరాల పొలం కూడా నీ పేర్న రిజిస్ట్రేషన్ చేస్తాను. నేను ముంబయ్‌లో సెక్స్ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నాను. నేనిప్పుడు సంపూర్ణంగా స్త్రీనే. కానీ పిల్లల్ని కనలేని స్త్రీని. నా మనసు, శరీరం, ఆస్తి అన్నీ నీవే. నా సర్వస్వం ఇకపై నువ్వవుతావా? చెప్పు కిశోర్ బావా!" దీనాతిదీనంగా అడిగింది, దీపాలి.

కిశోర్ ముఖంలో పలు రంగులు మారాయి. చితిమంటల్లో చిటపట్లు తప్ప అక్కడ నిశ్శబ్దం తాండవిస్తోంది.

"బావా!" అని కిశోర్ కాళ్లపై పడింది దీపాలి. దీపాలి కళ్లు వర్షించి కిశోర్ పాదాల్ని తడిపాయి.

కాళ్లు వెనక్కు లాక్కుని "ఛ...ఛ..." అని అసహ్యంగా ముఖం పెట్టి పెద్ద పెద్ద అంగల్తో అక్కణ్ణించి కదిలిపోయాడు కిశోర్.

'జీవితం ఇంతే కదూ! ఇంతే!' అరిచింది దీపాలి. స్మశానమంతటా ఆమె అరుపు ప్రతిధ్వనించింది. స్మశానంలో శవాలింకా కాల్తూనే ఉన్నాయి. అక్కడ ఒక్కరూ లేరు. కాటికాపరి కూడా వెళ్లిపోయాడు. చితిమంటల్లో వెలుగే అక్కడ సమాధుల ఉనికినీ, దీపాలి ఉనికినీ నిలబెడ్తున్నాయి. కాల్తున్న కొరివిలాగా స్మశానంలో ఒంటరిగా నిల్చుంది. ఈ జనారణ్యంలోకి నిట్టూరుస్తూ కదిలింది.... జీవితాంతం తన బతుకింతే! అనుకుంటూ. ■

వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్- 3
సెల్స్: 9885446501/ 9885449458

'పాషాణ వేధ' అంటే ఏమిటి?

ఏ గృహమునందైనా గృహ యజమానిగానీ, ఆ కుటుంబ సభ్యులుగానీ దీర్ఘవ్యాధులచేత పీడింపబడుతున్నా, అపమృత్యువు వాత పడుతున్నా ఆ గృహం 'శల్య వేధ' 'పాషాణ వేధ' మొదలైన తీవ్రమైన వేధల చేత వాస్తు దోషం సంభవించి బాధింపబడుతున్నారని నిర్ధారించుకోవచ్చు.

దీర్ఘ వ్యాధి పీడనం, అపమృత్యువు బారిన పడటం- లాంటి దుష్ఫలితాలు పునరావృతమవుతుంటే ఈ వేధ దోషం చాలా తీవ్రంగా ఉన్నదని అర్థం చేసుకొని, ఆ దోషం తొలగించే ప్రయత్నం శక్తివంచన లేకుండా చేయవలసిందే! గతంలో 'శల్యవేధ' దోషం గురించి వివరించాను.

పాషాణ వేధ

గృహావరణలో లేక గృహంలో భూమి ఉపరితలం నుండి 3 అడుగుల లోతువరకు రాళ్లు ఉన్నట్లయితే ఆ గృహానికి 'పాషాణ వేధ' అనే వాస్తు దోషం కలుగుతుందని వాస్తు శాస్త్ర వచనం. గృహం నిర్మించే సమయంలో నిర్మాణానికి అవసరమైన పునాదిరాళ్లు (వాటిపైన నిలుస్తాయి కాబట్టి) ఈ దోషాన్ని కలిగించవు. గొయ్యిగా ఉన్న స్థలాలను, స్థలాల్లో ఉన్న గోతులను పూడ్చడానికి మట్టితోపాటు బండరాళ్లను కూడా వెయ్యటంవలన ఆ దోషం ఏర్పడే అవకాశం ఉంది. ఇంటి స్థలాన్ని, ఇంటి కట్టుబడి స్థలాన్ని ఎత్తు పెంచటానికి ఫిల్లింగ్ చేయవలసి వచ్చినప్పుడు 'పాషాణ వేధ' దోషం ఏర్పడే అవకాశం ఉంటుంది. కొన్ని కొండ ప్రాంతాలలో ప్రకృతి సిద్ధంగా ఉన్న పాషాణాలను తొలగించటానికి వీలు కానప్పుడు అలాగే మట్టితో ఫిల్లింగ్ చేసి గృహ నిర్మాణం గావించినప్పుడు ఈ వేధ దోషం కలిగే అవకాశం ఉన్నది. ఎగుడు దిగుడు కొండ ప్రాంతాల్లో గృహ నిర్మాణ సమయంలో ప్రకృతిసిద్ధంగా ఉన్న బండరాళ్లు సగ భాగం ఫిల్లింగ్ లోపలికి వెళ్లినప్పటికీ మిగతా సగ భాగం పైకి కనబడుతున్నప్పుడు 'పాషాణ వేధ' దోషముండదు. కానీ గృహావరణలో ఏ దిక్కున ఈ బండరాళ్లు కనిపిస్తున్నాయోనన్న విషయంపైన ఆధారపడి మంచీ-చెడూ ఫలితాలుంటాయి. కానీ ఇది ఆవరణకు మాత్రమే పరిమితం. ఇంటి లోపలి భాగం ఎక్కడ కూడా సగం భూమిలోకి, సగం పైకి కనపడే శిలలు ఉండకూడదు. రాతి ప్రాంతమైనా దాదాపు 4 అడుగులు ఫిల్లింగ్ చేసుకొని గృహ నిర్మాణం గావించుకోవటం వలన ఈ దోషముండదని గమనించాలి.

చిన్న రాళ్లు, కాంక్రీటు రాళ్లు మొ॥ ఈ దోషాన్ని కలుగజేయవు. అతి తీవ్రమైనటువంటి చెడు ఫలితాలు కలుగజేసే 'పాషాణ వేధ' కలుగకుండా నిర్మాణ సమయంలోనే జాగ్రత్త పడటం వలన అనేక విధాలైన అరిష్టాలనుండి తప్పించుకోవచ్చు.

బాత్ రూమ్ ఏ వైపుండాలి?

ప్రసాద్‌కుమార్ - కోరుట్ల

ప్రశ్న: వాస్తురీత్యా మా ఇల్లు చాలా తప్పుగా వుందేమోననిపిస్తోంది. ఇంటి కొలతలు తెలియవు. అంచనా ప్రకారం పంపిస్తున్నాను. మా ఇంట్లో వాస్తు మార్పులు ఎక్కడెక్కడ చేయాలో తెలియజేయగలరు. బాత్ రూమ్ లేదు. ఏ వైపు కడితే బాగుంటుంది. నీళ్లు ఏ వైపుకి వెళ్తే బాగుంటుంది?

జవాబు: మీ ఇంటికి పశ్చిమంలో చాలా ఎక్కువ స్థలం ఉన్నది. అది తూర్పు స్థలానికి పెంచి వున్నది. వాస్తు రీత్యా అది సరైంది కాదు. ఆ స్థలాన్ని తగ్గిస్తూ మీరు ఒక గోడ లాంటిది కట్టుకోండి. పశ్చిమ స్థలంకన్నా తూర్పు స్థలం ఎక్కువ ఉండేలా చూసుకోండి. దక్షిణం, పశ్చిమాలలో ఇంటిని తాకకుండా విడిగా బాత్ రూమ్ నిర్మించుకోవచ్చు. నీళ్లు ఏ దిశ నుండి ప్రవహించినా ఈశాన్యం చేరి నట్లయితే శుభప్రదం. ఈ కొద్ది మార్పులతో మీకు సత్ఫలితాలు కలిగే అవకాశం ఉన్నది.

సెప్టిక్ ట్యాంక్‌పైన బాత్ రూమ్?!?

మాధవరావు - చీరాల

ప్రశ్న: మాకు ఇంట్లో ఖాళీ స్థలం తక్కువగా ఉన్నందున సెప్టిక్ ట్యాంక్ మీద బాత్ రూమ్ నిర్మించాం. అప్పటినుండి మా ఇంట్లో కొన్ని నష్టాలు కలుగుతున్నాయి. సెప్టిక్ ట్యాంక్ మీద బాత్‌రూమ్ నిర్మాణం సరైందా? కదా?

జవాబు: సెప్టిక్ ట్యాంక్‌లపై బాత్ రూమ్ నిర్మాణం చేయకూడదు. అందువల్ల కొన్ని కష్టనష్టాలు కలిగే అవకాశం ఉన్నది. మీరు ఆ బాత్‌రూమ్‌ని తొలగించి వాస్తురీత్యా మరో స్థలంలో నిర్మించుకోవటం మంచిది.

ఎప్పుడూ ఆరోగ్య సమస్యలు!? ఎందువల్ల?

చంద్రశేఖర్ - మంచిర్యాల

ప్రశ్న: మా ఇల్లు 1964లో కట్టాం. మా ఇంటికి వాస్తు దోషాలున్నాయని చాలా మంది చెబుతున్నారు. ఇంట్లో ఎవరో ఒకరు ఎప్పుడూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ మధ్యనే మా నాన్నగారు హఠాత్తుగా మరణించారు. ఇంటి ముఖద్వారం ఉత్తరంగా ఉంటుంది. తూర్పున స్థలం తక్కువగా ఉంది. పడమర వైపు స్థలం ఎక్కువగా ఉన్నది. ఈ మధ్యనే పడమర వైపు స్థలం కొన్నాం.

జవాబు: దక్షిణం వీధి ఉన్నప్పుడు ఉత్తర ముఖ ద్వార గృహం నిర్మించడం వాస్తు విరుద్ధమవుతుంది. మీరు పశ్చిమంలో కొన్న ఖాళీ స్థలంవల్ల ఇంటి స్థలానికి, పశ్చిమ వాయువ్యం పెరిగినట్లయింది. అది దోషమేమీ కాదు. ఇంటికి పశ్చిమ భాగంలో ఎక్కువగా ఖాళీ స్థలం ఉందని రాశారు. కానీ ప్లాన్‌లో అలా కనిపించడం లేదు. ఇంటి ఆవరణలోని ఈశాన్యంలో ఒక గది, వంటగది నిర్మించారు. దీనివల్ల ఈశాన్యం మూత ఏర్పడటమే కాక వంట సరయిన స్థానంలో జరగకపోవటం వల్ల సర్వతోముఖాభివృద్ధి కుంటు పడుతుంది. వీటిని ఏర్పాటు చేసుకోవటంవల్ల పరిస్థితులు చాలావరకు మెరుగవుతాయి. ■

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: --
పుట్టినతేదీ:-------------------- ఊరు: --------------
జన్మనక్షత్రం:----------తల్లిపేరు:----------------------
చిరునామా: --
------------------- ఫోన్: -----------------------

"అసలు పెళ్లెందుకు?" అంటున్నాడు...!

పర్సనల్ పాయింట్

చల్లా సుబ్రహ్మణ్యం

1 సి-ఐక్యూ టవర్స్, 3-4-540,
నారాయణగూడ, హైదరాబాద్-27
మొబైల్: 9866362224/ 9553662224
challascounsel@gmail.com
www.challascounsel.com

ప్రశ్న: నమస్కారం చల్లాగారూ! మా అబ్బాయి వయసు 32. చదువులో ఫస్ట్. చిన్నప్పటినుంచి చాలా చురుకు. చాలా తెలివైనవాడు. మా బంధువుల్లోగానీ, స్నేహితుల్లోగానీ మా వాడంటే అందరికీ చాలా ఇష్టం. అందంగా వుంటాడు. మంచి జీతం. అన్నీ బాగున్నాయి. పెళ్లి చేద్దామని నాలుగేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయి. వాడు పెళ్లి చేసుకోకపోగా, వాడి ప్రశ్నలతో మాకు మైండ్ బ్లాక్ అయిపోతోంది. వాడు అడిగే ప్రశ్నలు:

* అసలు పెళ్లి అవసరమేంటి?

* పెళ్లి చేసుకోకుండా బతకలేమా?

* స్వామి వివేకానంద, శంకరాచార్య లాంటి గొప్పవాళ్లు చేసుకున్నారా?

* విదేశాల్లో 35-40 ఏళ్ల వయసు వచ్చే వరకు పెళ్లి చేసుకోరు తెలుసా? అంటూ ఏదేదో వాదించి పెళ్లి దాటేస్తున్నాడు. కారణం ఏమై ఉండవచ్చు?

జవాబు: ఎవరైనా అమ్మాయిని ప్రేమించి, ఆ అమ్మాయి మాటకోసం ఎదురుచూస్తూ ఉండవచ్చు.

* ప్రేమించిన అమ్మాయి దక్కకపోవడంతో నిరాశలో వుండి వుండవచ్చు.

* శారీరకంగా ఏదైనా లోపం వుండవచ్చు.

* పెళ్లికి లింక్ అయివున్న జీవితాశయం ఏదైనా వుండవచ్చు.

* పెళ్లికి సంబంధించిన స్థిరమైన అభిప్రాయాలు వుండవచ్చు (చిన్నతనంలో ఏర్పడినవి లేదా చదువుకునే రోజుల్లో ఏర్పడినవి కావచ్చు)

* వివేకానంద, ఆదిశంకరుడిలా ఓ గొప్ప ఆధ్యాత్మిక, తాత్విక, సమాజ ఉద్ధరణ దృక్పథంలో వుండి వుండవచ్చు.

ఏది ఏమైనా అసలు కారణం తెలుసుకోకుండా కంగారుపడటం, అతన్ని కంగారు పెట్టడం లాంటి పనులు చేయకండి. మంచి కౌన్సెలర్ సహాయం తీసుకోండి.

గుడ్ లక్.

అతిగా ఆలోచిస్తున్నా!

కె.కె.డి - ఎల్.బి.నగర్

